సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 11 । అక్టోబర్ । 2024



ఆకట్టుకున్న బతుకమ్మలు



న్యూస్‌రీల్

గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు

- వినతులు స్వీకరించిన జిల్లా విద్యాశాఖ అధికారి

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌అర్బన్ : జిల్లా విద్యాశాఖ చేపట్టిన డీఎస్సీ పోస్టుల నియామకాల్లో పలువురు అభ్యర్థులకు 'అన్యాయం జరిగింది' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి డీఈవో దుర్గాప్రసాద్ స్పందించారు. అభ్యర్థుల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశారు. అలాగే ఎస్జీటీ విభాగంలో నాన్ లోకల్ అభ్యర్థిని సాంకేతిక కారణాల వలన ఎంపిక చేయడం జరిగిందని గుర్తించిన అధికారులు లోకల్ అభ్యర్థిచే భర్తీ చే యాలని రాష్ట్ర అధికారులకు విన్నవించారు. మొదట ఇచ్చిన పోస్టింగ్ ఆర్డర్‌ను నిలుపుదల చేశారు. డీఎస్సీ నియామకాలకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ సూచించిన ఆదేశాల మేరకు ప్రక్రియ చేపట్టినట్లు డీఈవో తెలిపారు. గురువారం కూడ కొందరు అభ్యర్థులు జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి వచ్చారు. ధ్రువ పత్రాల పరిశీలనకు హాజరైన తమకు ఉద్యోగం రాలేదని, ఉపాధ్యాయ ఎంపికల్లో పలు అనుమానాలు ఉన్నాయన్నారు. డీఈవో వీరి వద్ద వినతులు తీసుకుని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారులకు పంపించారు. వారి ఆదేశాల మేరకు నిర్ణయం ఉంటుందన్నారు.

నియామక టీచర్లు రిపోర్టు చేయాలి

నిజామాబాద్‌అర్బన్: డీఎస్సీ పోస్టుల భర్తీలో ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులు శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో రిపోర్టు చేయాలని డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. అభ్యర్థులు నివేదికతో పాటు నియామక పత్రం సమర్పించాలన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అనుమతిలేని నిర్మాణాల క్రమ బద్ధీకరణకు బల్దియా కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ మకరందు తెలిపారు. లేఅవుట్ల క్రమ బద్ధీకరణకు రూ.1000 చెల్లించి 33,814 మంది దరఖాస్తు చేసుకున్నారని కమిషనర్ పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 97009 18886ను సంప్రదించాలన్నారు.





బోర్గాంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

పల్లే పట్నం పూలవనం..

- జిల్లాలో ఘనంగా సద్దుల బతుకమ్మ
- పాటలతో మార్మోగిన ప్రధాన కూడళ్లు

జిల్లాలో గురువారం పల్లె, పట్నం పూల వనంగా మారాయి. సద్దుల బతుకమ్మను ఘనంగా నిర్వహించారు. ఆడపడుచులు రకరకాల పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మలతో సందడి చేశారు. బతుకమ్మలను ఒక చోట చేర్చి ఆడిపాడి ఆనందంగా గడిపారు. రామరామ..ఉయ్యాలో.. రామనే శ్రీరామ ఉయ్యాలో.. అంటూ సాగిన పాటలు మార్మోగాయి.. అనంతరం నీటి కొలనులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. జిల్లా కేంద్రంలోని ఖిల్లా రఘునాథ చెరువు, కంఠేశ్వర్, పూలాంగ్, గాయత్రినగర్, పెద్దబజార్, న్యూ హౌసింగ్ బోర్డ్, ఎల్లమ్మ గుట్ట, బోర్గాం(పి) ప్రాంతాల్లో బతుకమ్మల సందడి నెలకొంది. – నిజామాబాద్ రూరల్






రఘునాథ చెరువులో బతుకమ్మల నిమజ్జనం



బోర్గాంలో బతుకమ్మలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న మహిళలు

వెలకట్టలేని రత్నం.. టాటా

- దేశ అభ్యున్నతే లక్ష్యంగా పయనించిన పారిశ్రామిక దిగ్గజం
- భారత భూమే కాక ప్రపంచవ్యాప్తంగా ఆయనకు కన్నీటి నివాళి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : రతన్ టాటా.. ఈ పేరు వింటేనే కుటుంబ సభ్యుడిగా భావన కలుగుతుంది. ఇంతలా భారత ప్రజలతోనే కాదు ప్రపంచంలోని వివిధ దేశాలతో అనిర్వచనీయమైన అనుబంధాన్ని పెనవేసుకున్న లెజెండ్ పర్సనాలిటీగా రతన్ టాటా గుర్తింపు పొందారు. ప్రతిఒక్కరికీ ఆమోదయోగ్యుడిగా ముద్ర వేసుకున్న ఈయన పేరు చెబితేనే ప్రతి భారతీయుడు సగర్వంగా రొమ్ము విరుచుకుంటాడు. ఈ పారిశ్రామిక దిగ్గజం సేవాతత్పరతలో మాత్రం ఎవ్వరికీ అందనంత ఎత్తులో నిలిచారు. అలాగే సమున్నతంగా తిరిగిరాని లోకాలకు వెళ్లారు. రతన్ టాటాజీ మరణ వార్త వినగానే ఒక్కసారిగా గుండెలు బరువెక్కిన పరిస్థితి. ఇంతటి మహోన్నత వ్యక్తి వ్యక్తిత్వానికి ప్రతిఒక్కరూ కన్నీటి నివాళి అర్పిస్తున్నారు.

■ టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్. ఈ సంస్థ చేసిన పరిశోధనలు చూస్తే ఎవ్వరైనా సరే ఆశ్చర్యపోవాల్సిందే. తమ వ్యాపారాన్ని విస్తరించుకునేదానికంటే భారతదేశ అవసరాల కోసం ఆకాశమే హద్దుగా పరిశోధనలు చేసే యువతను, శాస్త్రవేత్తలను తయారు చేసిన ఘనత ఒక్క టాటా సంస్థకే దక్కిందనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. దేశ అవసరాల కోసం అవసరమైన పరిశోధనలు చేసే విషయంలో ప్రభుత్వం కంటే మిన్నగా ఆలోచించిన సంస్థ ప్రపంచంలోనే టాటా ఒక్కటే కావడం మనందరికీ గర్వకారణమే. ఈ దేశానికి ఎంత ఇవ్వగలమో అంతకంటే ఎక్కువ ఇచ్చిన తిరుగులేని మహోన్నత వ్యక్తిత్వం రతన్ టాటా సొంతం చేసుకున్నారు. మనిషి బతికితే రతన్ టాటాలా బతకాలిరా అనేవిధంగా చేసుకున్నారు. టాటా సంస్థల్లో పని చేసే ఉద్యోగులు సైతం సమున్నతంగా రొమ్ము విరుచుకోవడంతో పాటు సామాజిక బాధ్యత కలిగి ఉండేలా తీర్చిదిద్దిన ఘనత రతన్ టాటా సొంతం. ఇంతటి మహోన్నత వ్యక్తి మరో పదేళ్ల బతికుంటే దేశానికి ఎంతో ఉపయోగం అనుకునే వారి సంఖ్య అసంఖ్యాకంగా ఉందంటే సాధారణ విషయం కాదు. భారతదేశంలోని అత్యధిక మంది రతన్ టాటా స్టేటస్‌లు పెట్టుకోవడం, సోషల్ మీడియాలో నివాళులు అర్పించడం చూస్తుంటే ప్రజల బాధ ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

టాటా మృతి భారత్‌కు తీరని లోటు



గొప్ప దూరదృష్టి గల రతన్ టాటా మరణించడం చాలా బాధాకరం. ఆయన అసాధారణ నాయకత్వం, దూరదృష్టి, దాతృత్వం, నిబద్ధత ప్రపంచంపై చెరగని ముద్ర వేసింది.

– నల్ల దినేష్‌రెడ్డి, ప్రకాష్ గ్రూప్ ఆఫ్ కంపెనీలు

ప్రతిఒక్కరికీ ఆదర్శనీయుడు, మార్గదర్శి



రతన్ టాటా పేరు వింటేనే ప్రతి భారతీయుడు సొంత మనిషి లాగా భావిస్తాడు. అసాధారణ వ్యక్తిత్వంతో ప్రతిఒక్కరికీ ఆదర్శంగా నిలిచారు. ప్రభుత్వాలు సైతం చేయలేని పనులను ఆయన చేయడం గొప్ప విషయం.

– ధాత్రిక రమేష్



టాటా టీంతో మంచాల జ్ఞానేందర్

రతన్ టాటాను కలిసే అవకాశం వచ్చినప్పటికీ మిస్సయ్యాను

రతన్ టాటాను కలవాలనే కల కలగానే మిగిలిపోయింది. ఆయనను కలిసేందుకు గతంలో ప్రయత్నించాను. ఈ క్రమంలో ముంబాయి నుంచి టాటా కంపెనీ బృందం నిజామాబాద్‌కు వచ్చి మా ట్రస్టు చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి తెలుసుకుంది. మేము చేస్తున్న సేవాకార్యక్రమాల పట్ల ఆ బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. ఆయనను కలిసే అవకాశం దక్కింది. ఆ సమయంలో కోవిడ్ లాక్‌డౌన్ రావడంతో కలిసే అవకాశాన్ని కోల్పోయాను. ఆయనకు భగవద్గీత కలిసి ఇచ్చే అవకాశం లేక పోస్టు ద్వారా పంపించాను.

– మంచాల జ్ఞానేందర్ గుప్తా

ధాన్యం కొనుగోలు కేంద్రాలు @629

- బోనస్ ప్రకటనతో పెరిగిన సంఖ్య
- సన్నాలు.. దొడ్డు రకాలకు వేర్వేరు కేంద్రాలు
- వడ్లు గుర్తించేందుకు క్యాలిబర్ మిషన్లు!



ధాన్యం తూకం వేస్తున్న దృశ్యం (ఫైల్)

సుభాష్‌నగర్ : రాష్ట్ర ప్రభుత్వం సన్నరకాల ధాన్యం సాగును ప్రోత్సహించేందుకు రూ.500 బోనస్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచనున్నారు. సన్నరకం, దొడ్డురకం వడ్లకు వేర్వేరు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలోనే చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల సంఖ్య 480 నుంచి 629 వరకు పెరిగింది. ప్రభుత్వం ప్రకటించిన 33 రకాలు (బోనస్ ప్రకటించిన) గుర్తించేందుకు క్యాలిబర్ మిషన్లు తెప్పించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. దసరా తర్వాత కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది.

జిల్లాలో 4.30 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. అందులో 3.67 లక్షల ఎకరాల్లో సన్నరకాలు, 63 వేల ఎకరాల్లో ఇతర రకాలు సాగైంది. మొత్తం 11.95 లక్షల మెట్రిక్ టన్నుల పంట దిగుబడి రానుండగా, కేంద్రాల ద్వారా 8 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యం పెట్టుకున్నారు. ధాన్యం తరలించేందుకు రవాణా టెండర్ ప్రక్రియ పూర్తి చేసి అప్రూవల్ కోసం ఉన్నతాధికారులకు పంపించారు. జిల్లాను 10 సెక్టార్లుగా విభజించి టెండర్ ప్రక్రియ పూర్తిచేశారు. ధాన్యం సేకరించేందుకు 2 కోట్ల గన్నీ బ్యాగులు అవసరమవుతాయని అధికారులు భావిస్తున్నారు. ధాన్యాన్ని 227 రైస్‌మిల్లులకు కేటాయించనున్నారు.

ప్రభుత్వం సేకరించనున్న 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం లక్ష్యంలో 7 లక్షల మెట్రిక్ టన్నులు సన్నరకం, లక్ష మెట్రిక్ టన్నులు ఇతర రకాలు ఉన్నాయి. 465 కొనుగోలు కేంద్రాల్లో సన్నరకాలను, 164 కేంద్రాల్లో దొడ్డురకాలను సేకరించనున్నారు. ఇందుకోసం కొనుగోలు సంస్థలు (ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా, డీసీఎంఎస్) ట్యాబ్‌లను కొనుగోలు చేస్తున్నాయి. ఒక్కో ట్యాబ్ ధర రూ.25 వేల వరకు, ఆపరేటర్ల జీతభత్యాల భారం సొసైటీలపై పడనుంది.

ఒక్కో సెంటర్‌కు.. ఒక్కో మిషన్!

బోనస్ ప్రకటించిన నేపథ్యంలో ఒక్కో సెంటర్‌కు ఒక్కో క్యాలిబర్ మిషన్ (ధాన్యం కొలిచే యంత్రం)ను అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. వాటి నిర్వహణ బాధ్యత వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు (ఏఈవో) అప్పగించనుంది. మిషన్‌తో ఏఈవోలు సర్టిఫైడ్ చేసిన తర్వాతే ధాన్యం తూకం వేయనున్నారు. కొన్ని జిల్లాల్లో ఇప్పటికే మిషన్‌పై ఏఈవోలకు శిక్షణ ఇస్తుండగా, జిల్లాలో కొంత జాప్యం జరుగుతోంది. అదేసమయంలో క్యాలిబర్ మిషన్ల కొరత కూడా ఉన్నట్లు తెలిసింది.

ధాన్యం సేకరణకు ఏర్పాట్లు పూర్తి



జిల్లాలో ధాన్యం సేకరణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశాం. ఉన్నతాధికారుల సూచనల మేరకు దొడ్డు, సన్నరకాలకు వేర్వేరు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. 629 సెంటర్లను ప్రారంభిస్తాం. సన్నరకాలకు రూ.500 బోనస్ ప్రభుత్వం ప్రకటించింది. సన్నరకాలను కొలిచేందుకు క్యాలిబర్ మిషన్లు త్వరలోనే జిల్లాకు రానున్నాయి.

– వైపీ రమేశ్, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ

సమాజాన్ని జాగృతం చేయడమే ఆర్‌ఎస్‌ఎస్ ఉద్దేశం

- హిందూ జాగరణ మంచ్ జాతీయ సంఘటన మంత్రి పెనుబల్లి దేవేందర్‌రెడ్డి



సభలో పాల్గొన్న స్వయంసేవకులు



మాట్లాడుతున్న పెనుబల్లి దేవేందర్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఈ దేశాన్ని, ధర్మాన్ని రక్షించడానికి సమాజాన్ని జాగృతం చేయడమే ఆర్‌ఎస్‌ఎస్ ఉద్దేశమని హిందూ జాగరణ మంచ్ (హిందూ వాహిని) అఖిల భారత సంఘటన మంత్రి పెనుబల్లి దేవేందర్‌రెడ్డి అన్నారు. ఇందూరు నగరంలోని హరిచరణ్ మార్వాడీ పాఠశాలలో గురువారం ఆర్‌ఎస్‌ఎస్ విజయదశమి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రధాన వక్తగా హాజరైన దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ రామ రావణ యుద్ధానికి సాటిలేని యుద్ధం లేనట్లు, ఆర్‌ఎస్‌ఎస్ కు సాటిరాగల సంస్థ ప్రపంచంలోనే లేదన్నారు. గత 99 సంవత్సరాలుగా సమాజ హితం కోసం తిరస్కారాలను, అణచివేతలను ఎదుర్కొని నిలబడిన సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ అన్నారు. 1925లో పుట్టిన తొలినాళ్లలోనే 1928లో నాగపూర్‌లో మైనారిటీల దాడుల నుంచి హిందువులకు రక్షణ కల్పించిన సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఎదుగుదలను చూసి ఓర్వలేని పలువురు రాజకీయ నాయకులు గాంధీ హత్యానంతరం వివాదాస్పద బాబ్రీ కట్టడం, కూల్చివేత తర్వాత ఆర్‌ఎస్‌ఎస్‌పై నిషేధం విధించారన్నారు. ఈ నిషేధాలను ప్రజల మద్దతుతో ఎదుర్కొని నిలిచిన సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ అన్నారు. ఇందిర విధించిన ఎమర్జెన్సీని ఎదురొడ్డి నిలిచి ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు వేలాదిగా జైలుపాలయ్యారన్నారు. వారి కుటుంబాలు కష్టాలు పడ్డా దేశం కోసం భరించారన్నారు. అదే విధంగా సమాజాన్ని జాగృతం చేసి లక్షలాదిగా జైల్‌భరో చేశారన్నారు. దీనికి దిగివచ్చిన ఇందిరా గాంధీ తరువాతి ఎన్నికల్లో ఆర్‌ఎస్‌ఎస్ మద్దతు కోరితే తామంతా జైళ్లలోనే మగ్గుతాం కానీ నియంతలకు మద్దతు ఇచ్చేది లేదని తేల్చిచెప్పింది ఆర్‌ఎస్‌ఎస్ అన్నారు. మరోవైపు గో హత్యలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త సంతకాల సేకరణ, వివేకానంద శిలా స్మారకం కన్యాకుమారిలో నిర్మించడం, రామసేతు పరిరక్షణ ఉద్యమం, అమర్‌నాథ్ యాత్ర పరిరక్షణలో, రామజన్మభూమి ఉద్యమంలో ప్రజామద్దతుతో విజయం సాధించిందన్నారు. వందవ ఏట అడుగుపెడుతున్న సందర్భంగా దేశ, ధర్మరక్షణకు పంచపరివర్తన అంటే పర్యావరణ పరిరక్షణ, కుటుంబ వ్యవస్థ బలోపేతం, సమరసత, స్వదేశీ వ్రతం, విధులను, బాధ్యతలను తెలిసిన ప్రజలను తయారు చేయడం లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. హిందుత్వాన్ని నాశనం చేసే శక్తుల భరతం పట్టాలన్నారు. ఈ కార్యక్రమానికి ఇందూరు జిల్లా సంఘబాలక్ కాపర్తి గురుచరణం అధ్యక్షత వహించారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, వెయ్యి మంది స్వయంసేవక్‌లు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలనందించాలి


వర్ని ఏఎంసీ నూతన పాలకవర్గ సభ్యులతో ప్రభుత్వ సలహాదారు పోచారం, ఎంపీ సురేశ్ షెట్కార్

వర్ని: వ్యవసాయ మార్కెట్‌లో అవినీతి రహిత పాలనందించాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఏఎంసీ నూతన పాలకవర్గానికి సూచించారు. గురువారం నిర్వహించిన నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాలకవర్గ సభ్యులతో ప్రమాణం చేయించిన అనతరం మాట్లాడారు.గత పాలకవర్గాలు అవినీతికి పాల్పడ్డాయనే ఆరోపణలున్నాయని, నూతన పాలకవర్గం బాధ్యతగా వ్యవహరిస్తూ రైతుల అభివృద్ధికి పాటుపడాలన్నారు.ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మామీలను రాష్ట్ర ప్రభుత్వం దశలవారీగా నెరవేరుస్తుందన్నారు. ధాన్యానికి దళారులు సరైన ధర చెల్లించకపోతే ప్రభుత్వం వెనువెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తుందన్నారు.

రవీందర్‌రెడ్డి రెచ్చగొడుతున్నారు..

బాన్సువాడ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలైన ఏనుగు రవీందర్‌రెడ్డిని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు మహేశ్ కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గాన్ని వదిలి వెళ్లాలని సూచించారని పోచారం అన్నారు. వారు సూచించినప్పటికీ రవీందర్‌రెడ్డి వెళ్లిపోకుండా నియోజకవర్గంలో రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పాత, కొత్త కాంగ్రెస్ నాయకులందరినీ కలుపుకొని అభివృద్ధికి బాటలు వేస్తానని పేర్కొన్నారు. జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, వర్ని ఏఎంసీ చైర్మన్ సురేశ్‌బాబా, ఉపాధ్యక్షుడు కొత్తిమీర్కర్ లక్ష్మణ్, డీసీసీబీ మాజీ చైర్మన్ భాస్కర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి కూనీపూర్ రాజిరెడ్డి, వర్ని సొసైటీ మాజీ అధ్యక్షుడు వీర్రాజు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా అంతిరెడ్డి

- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం
- నియామకపత్రం అందజేసిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి


నియామకపత్రాన్ని అందజేస్తున్న సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్ : జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా అంతిరెడ్డి రాజారెడ్డిని నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఈనెల 9వ తేదీన జీవో నంబర్ 187ను జారీచేసింది. మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లో ఆయనకు నియామకపత్రం అందజేశారు. జిల్లా కేంద్రానికి చెందిన అంతిరెడ్డి కాంగ్రెస్‌లో చురుకైన కార్యకర్తగా గుర్తింపుపొందారు. నిజామాబాద్ సొసైటీ చైర్మన్‌గా సుదీర్ఘకాలం (1992 నుంచి 2018 వరకు) పనిచేశారు. అంతరెడ్డి రాజారెడ్డి కాంగ్రెస్‌తో 1980లో తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 1981–82 గిరిరాజ్ కళాశాల అధ్యక్షుడిగా పనిచేశారు. 1989 నుంచి 1995 వరకు డీసీసీ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. 2011 నుంచి ఇప్పటివరకు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అంతిరెడ్డి ముఖ్య అనుచరుడు. తనను గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమించినందుకు సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి, కాంగ్రెస్ పెద్దలకు ఈ సందర్భంగా అంతిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

సెషన్స్ కోర్టు పీపీగా రాజేశ్వర్‌రెడ్డి


రాజేశ్వర్ రెడ్డిని అభినందిస్తున్న బార్ సభ్యులు

ఖలీల్‌వాడి: జిల్లా సెషన్స్ కోర్టు పీపీగా ధర్పల్లి రాజేశ్వర్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. ధర్పల్లి మండల కేంద్రానికి చెందిన రాజేశ్వర్ రెడ్డి అక్కడే పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసి నగరంలో ఇంటర్, ప్రభుత్వ గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. నాందెడ్‌లోని లా కళాశాల నుంచి 1986లో పట్టభద్రులయ్యారు. అదే సంవత్సరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకుని నిజామాబాద్ జిల్లాకోర్టు లో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. గతంలో ఆయన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహించారు. విద్యార్థి దశలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న కాలంలో యువజన కాంగ్రెస్, కాంగ్రెస్‌లో ఉమ్మడి జిల్లాలో ఉన్నత పదవులు నిర్వహించారు. రాజేశ్వర్‌రెడ్డికి గురువారం జిల్లాకోర్టు ప్రాంగణంలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్యాలయంలో ఇన్‌చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాదస్తు రాజారెడ్డి పదవి బాధ్యతలను అప్పగించారు. బార్ అధ్యక్షుడు మల్లెపూల జగన్‌మోహన్‌గౌడ్, సీనియర్ న్యాయవాదులు ఆకుల రమేశ్, నీలకంఠరావు, ఎర్రం గణపతి, గడుగు గంగాధర్, రాజ్ కుమార్ సుబేదార్, శ్రీహరి ఆచార్య, మంచికట్ల గోవర్ధన్, కిరణ్‌కుమార్ గౌడ్, నల్లవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఆశ నారాయణ తదితరులు రాజేశ్వర్‌రెడ్డిని అభినందించారు.

క్లుప్తంగా

'ఎస్సై వీరంగం చేశారు'

నిజామాబాద్‌నాగారం: నగరంలోని రెండో టౌన్ ఎస్సై యాసర్ అరాఫత్ తన ఇంట్లో వీరంగం సృష్టించాడని హైమద్‌పురా కాలనీకి చెందిన అజీజ్ ఉన్నీసాబేగం ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తన ఇంట్లో కొన్నేళ్లుగా రహీం అనే వ్యక్తి కిరాణాదుకాణం నడుపుతున్నాడని, అతడు నిషేధిత గుట్కా, సిగరెట్లు విక్రయిస్తుండడంతో తాను అభ్యంతరం తెలిపానన్నారు. ఇంటి సమీపంలో ఉర్దూ పాఠశాల ఉందని, గుట్కా, సిగరెట్లు విక్రయిస్తే పిల్లలు చెడిపోయే ప్రమాదం రహీంకు చెప్పినా అతడు వినిపించుకోకపోవడంతో గత నెల 10వ తేదీన లోకాయుక్తకు, 18న మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు అజీజ్ ఉన్నీసా తెలిపారు. ఇటీవలే ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవ్ సైతం దుకాణంలో తనిఖీలు నిర్వహించి రహీంను హెచ్చరించారన్నారు. రహీం తన పలుకుబడితో రెండో టౌన్ ఎస్సై యాసర్ అరాఫత్‌తో కలిసి తన ఇంటికి వచ్చి భయపెట్టారని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు పిర్యాదు చేస్తానని చెప్పినా ఎస్సై బెదిరించారని, ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని అజీజ్ ఉన్నీసాబేగం కోరారు. దీనిపై ఏసీపీ, సీపీకి ఫిర్యాదు చేస్తానని ఆమె తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



డిచ్‌పల్లి: జ్వరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్ సూచించారు. మండలంలోని రాంపూర్‌లో యువకుడు మృతి చెందగా.. తుకారాం రాథోడ్‌తోపాటు ఆరోగ్య సిబ్బంది గురువారం బాధిత కుటుంబానికి చెందిన ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం గ్రామంలో ప్రజలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి జ్వరాల బారి నపడకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, వైద్యాధికారి డాక్టర్ సంతోష్, ఆరోగ్య విస్తీర్ణాధికారి శంకర్, ఆర్యోగ కార్యకర్తలు స్వర్ణలత, రేణుక, ఆశ, గ్రామస్తులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగి అవయవదానం

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి కె హన్మంతు తన మరణానంతరం శరీరాన్ని పరిశోధన కోసం నిజామాబాద్ మెడికల్ కళాశాలకు ఇవ్వనున్నట్లు అంగీకరిస్తూ హామీపత్రాన్ని అవయవ దాతల సంఘం సభ్యులకు అందజేశారు. ఈ మేరకు గురువారం దరఖాస్తు ఫారాన్ని సంఘం సభ్యులకు ఇవ్వగా, ఆయనను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ శరీర అవయవ దాతల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కాత్రగడ్డ భారతి, లయన్స్ బోధన్ సేవ అధ్యక్షుడు బాల గంగాధర్, కార్యదర్శి మంజులవాణి, భవాని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రవీంద్రబాబు, పల్లెం పాటి శ్రీధర్, బర్ల మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

పలువురిపై కేసు నమోదు

బోధన్‌రూరల్: సాలూర మండంలోని మందర్న గ్రామంలో దేవీమాత మండపం వద్ద బుధవారం రాత్రి అనుమతులు లేకుండా డ్యాన్స్, ఇతర కార్యక్రమాలు నిర్వహించిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ముందస్తుగా సమాచారం ఇవ్వకుండా, అనుమతులు పొందకుండా ప్రోగ్రాం నిర్వహించడంతో పలువురిపై కేసు నమోదు చేశామన్నారు.

మానసిక ఆరోగ్యం మహాభాగ్యం



నిజామాబాద్‌నాగారం: మానసిక ఆరోగ్యం మహాభాగ్యమని, ప్రజలందరికీ మానసిక ఆరోగ్యంపై విస్తృతంగా అవగాహన కల్పించడంతోపాటు ముఖ్యమైన ప్రదేశాల్లో టెలీమానస్ బోర్డులను ప్రదర్శించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టెలీమానస్ టోల్ ఫ్రీ నంబర్ బోర్డులను కలెక్టర్ గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చక్కని ప్రణాళికతో పని చేస్తే ఎటువంటి మానసిక ఒత్తిడి ఉండదన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి రాజశ్రీ, జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం అధికారి డాక్టర్ రవితేజ ఇన్నమూరి మాట్లాడుతూ.. మానసిక ఆరోగ్యాన్ని మించిన సంపద మరొకటి లేదన్నారు. చిన్న చిన్న సమస్యలకు భయపడకుండా ధైర్యంగా ఎదుర్కోవాలని, ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందన్నారు. మానసిక ఒత్తిడితో బాధపడేవారు టోల్ ఫ్రీ నంబర్ 14416కు ఫోన్ చేసి ఉచిత కౌన్సెలింగ్ పొందొచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్ ఎం ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజు, జిల్లా పీవోఎన్‌సీడీ అధికారి డాక్టర్ వినీత్‌రెడ్డి, కార్యాలయ పర్యవేక్షకులు చందర్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ వెంకటేశ్, ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు, స్వామి సులోచన, డీపీవో విశాల, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని ఎస్బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (ఆర్‌ఎస్ ఈటీఐ) ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్న ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. మహిళలకు బ్యూటీ పార్లర్ (30 రోజులు), మగ్గం వర్క్ శిక్షణ (30 రోజులు), టైలరింగ్ శిక్షణ (30 రోజులు) ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న 19 నుంచి 45 సంవత్సరాల లోపు మహిళలు దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థులు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల గ్రామీణ ప్రాంతానికి చెందిన వారై ఉండాలన్నారు. శిక్షణకాలంలో భోజన, హాస్టల్ వసతి ఉచితంగా అందజేస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 08461 295428 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

యూనివర్సిటీ నిర్లక్ష్యం.. డీఎస్సీ అభ్యర్థికి శాపం

- సకాలంలో బీఈడీ పరీక్షలు నిర్వహించని శాతవాహన యూనివర్సిటీ
- డీఎస్సీ ర్యాంకు సాధించినా బీఈడీ సర్టిఫికెట్ లేదు
- ఉద్యోగానికి దూరమైన అభ్యర్థి


ఇస్సాపల్ల శ్రీలాస్య, నాగాపూర్

మోర్తాడ్(బాల్కొండ): బీఈడీ పరీక్షల నిర్వహణలో యూనివర్సిటీ నిర్లక్ష్యం వహించడంతో డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థికి ఉద్యోగం దక్కకుండా పోయింది. బీఈడీలో అడ్మిషన్ తీసుకున్న అభ్యర్థులు కూడా ఉపాధ్యాయ అర్హత పరీక్షకు హాజరు కావొచ్చని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అవకాశం కల్పించినా యూనివర్సిటీ నిర్వాకం వల్ల ఉద్యోగ అన్వేషణలో ఉన్న అభ్యర్థికి చేదు అనుభవం ఎదురైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కమ్మర్‌పల్లి మండలం నాగాపూర్‌కు చెందిన ఇస్సాపల్ల శ్రీలాస్య బీఏ పూర్తి చేసి కోరుట్లలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీఈడీ చదువుతోంది. శాతవాహన యూనివర్సిటీ పరిధిలో గడిచిన ఆగస్టులోనే బీఈడీ పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. షెడ్యూల్ ప్రకారం ఆగస్టులో పరీక్షలను నిర్వహించి ఉంటే సెప్టెంబర్‌లో ఫలితాలను వెల్లడించేవారు. నాలుగో సెమిస్టర్ నిర్వహణలో కాలయాపన చేయడంతో బీఈడీ చదువుతున్నవారికి ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడింది. బీఈడీ చదువుతున్న వారికి ఉపాధ్యాయ అర్హత పరీక్షలో రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించడంతో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాలనే సంకల్పంతో శ్రీలాస్య కష్టపడి చదివింది. ఇటీవల విడుదలైన ఉపాధ్యాయ పోస్టుల అర్హత పరీక్షల్లో శ్రీలాస్యకు జిల్లా స్థాయిలో 43వ ర్యాంకు, ఎస్ఏ సోషల్‌కు సంబంధించి 10వ ర్యాంకు లభించింది. ఈ లెక్కన శ్రీలాస్యకు అనుకున్న విధంగా స్కూల్ అసిస్టెంట్ సోషల్‌కు ఎంపికైంది. ఈనెలలో నిర్వహించిన సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు శ్రీలాస్యకు బీఈడీ మెమో లేకపోవడంతో ఉపాధ్యాయ పోస్టుకు ఎంపిక చేయలేదు. ఇదే విషయాన్ని యూనివర్సిటీ దృష్టికి తీసుకవెళ్లగా ఆకస్మికంగా ఇదే నెలలో 3 నుంచి 5వ తేదీలోగా పరీక్షలను నిర్వహించారు. సకాలంలో బీఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షలను నిర్వహించి ఉంటే శ్రీలాస్యకు ఉపాధ్యాయ పోస్టు లభించి ఉండేది. డీఈడీ అభ్యర్థులు వారి మెమోలను అప్పగించడానికి ప్రభుత్వం ఒక నెల సమయం ఇచ్చింది. ఇదే నిబంధన బీఈడీ అభ్యర్థులకు లేకపోవడంతో శ్రీలాస్యకు అన్యాయం జరిగింది. యూనివర్సిటీ తప్పిదానికి బలైన శ్రీలాస్యను ఎలాగైనా ఉపాధ్యాయ పోస్టుకు ఎంపిక చేయాలని ఆమె కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ఎస్సారెస్పీలోకి తగ్గిన ఇన్‌ఫ్లో

- వరద కాలువకు నీటి విడుదల తగ్గింపు
- గేట్ల మూసివేత


ఎస్సారెస్పీ ప్రస్తుత నీటి మట్టం

బాల్కొండ: ఎగువ నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో తగ్గింది. బుధవారం మధ్యాహ్నం వరద పోటెత్తడంతో వరద గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసిన అధికారులు.. అర్ధరాత్రి తరువాత ఇన్‌ఫ్లో 22 వేల క్యూసెక్కులకు పడిపోవడంతో నీటి విడుదలను నిలిపి వేశారు. మళ్లీ గురువారం ఉదయం ఇన్‌ఫ్లో 34 వేల క్యూసెక్కులకు పెరగడంతో 6 వరద గేట్లను ఎత్తి దిగువకు 9,500 క్యూసెక్కుల నీటిని వదిలారు. మధ్యాహ్నం ఇన్‌ఫ్లో 11,600కు పడిపోవడంతో గేట్లను మూసివేశారు. ప్రస్తుతం ఎగువ నుంచి 11,590 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.

2వేల క్యూసెక్కులకు తగ్గిన నీటి విడుదల

వరద కాలువ ద్వారా నీటి విడుదలను తగ్గించారు. ముందుగా 12 వేల క్యూసెక్కుల నుంచి 7 వేల క్యూసెక్కులకు తగ్గించిన అధికారులు.. ఆ తరువాత 2 వేల క్యూసెక్కులకు తగ్గించి నీటిని విడుదల చేస్తున్నారు. కాకతీయ కాలువ ద్వారా 6,800 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 1,200, లక్ష్మి కాలువ ద్వారా 150, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్‌పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగుల కాగా, అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్‌నిండుకుండలా ఉంది.

అన్న స్ఫూర్తి, భర్త ప్రోత్సాహంతో..


నియామకపత్రం అందుకుంటున్న లావణ్య

జక్రాన్‌పల్లి: మండలంలోని బ్రాహ్మణ్‌పల్లికి చెందిన మాదరి లావణ్య డీఎస్సీ ఫలితాల్లో 85 ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్ (సోషల్)గా ఎంపికయ్యారు. పోలీసుశాఖలో ఉద్యోగం చేస్తున్న తన అన్నయ్యను స్ఫూర్తిగా తీసుకున్న పట్టుదలతో ఉద్యోగానికి సన్నద్ధమైన లావణ్యకు భర్త గంగామోహన్, అత్తమ్మ గంగు ప్రోత్సాహం తోడైంది. లావణ్య ప్రస్తుతం కస్తూర్బాగాంధీ బాలికల కళాశాలలో కాంట్రాక్ట్ అధ్యాపకురాలిగా పని చేస్తోంది. లావణ్యను గ్రామస్తులు అభినందించారు. లావణ్య తండ్రి దాసు గీత కార్మికుడిగా, తల్లి పుష్ప వ్యవసాయ కూలీగా పని చేస్తూ పిల్లలను చదివించారు.

రెండు ఉద్యోగాలు సాధించిన పేదింటి ఆడబిడ్డ


ఆకుల సుష్మ

ఇందల్వాయి: జక్రాన్‌పల్లి మండలం కలిగోట్ గ్రామానికి చెందిన ఆకుల సుష్మ రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి నేటితరం ఆడపిల్లలకి ఆదర్శంగా నిలించింది. తల్లిదండ్రులు సాయన్న, చిన్నుబాయి ప్రోత్సాహంతో చిన్ననాటి నుంచి చదవులు, ఆటల్లో రాణిస్తూ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో మాస్టర్స్ పూర్తి చేసింది. అనంతరం ఇందల్వాయి ఏకలవ్య మోడల్ స్కూల్‌లో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పీఈటీగా ఉద్యోగం చేసింది. గురుకులం, డీఎస్సీ రెండింటిలోనూ పీఈటీగా ఎంపికైంది. డీఎస్సీ పీఈటీ ఉద్యోగానికి సంబంధించిన నియామక పత్రాన్ని బుధవారం హైదరాబాద్‌లో అందుకుంది.

బాలిక అదృశ్యం

పాతంగల్ (రుద్రూర్) : పాతంగల్ మండల కేంద్రానికి చెందిన శైలజ అనే బాలిక అదృశ్యమైనట్లు ఎస్సై సందీప్ తెలిపారు. మతిస్థిమితం లేని బాలిక రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదన్నారు.

బాలిక కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. అదృశ్యమైన బాలిక ఆచూకీ తెలిసిన వారు సీఐ(87126 59871), ఎస్సై (87126 59878) నంబర్లకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై మహేందర్ గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పెద్దకొడప్‌గల్ మండలంలోని అబ్జల్ గ్రామానికి చెందిన పలువురు అక్రమార్కులు రాత్రి సమయాల్లో అబ్జల్ వాగు నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. గురువారం సైతం ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో మండలంలోని జాతీయ రహదారిపై ఆరు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తహసీల్దార్ దశరథ్ ట్రాక్టర్‌కు రూ. 8 వేల చొప్పున ఆరు ట్రాక్టర్లకు రూ. 48 వేలు జరిమాన విధించారు.

క్రైం కార్నర్

పరిస్థితి విషమించి వేర్వేరు ప్రాంతాలకు చెందిన నలుగురి మృతి

చెల్లె మృతి.. ప్రాణాపాయ స్థితిలో అక్క

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్లు ఆత్మహత్యయత్నం చేయగా చెల్లె మృతి చెందింది. అక్క ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతోంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన గురుజాల కిషన్‌కు మమత, ప్రత్యూష ఇద్దరు కూతుళ్లు. ఇటీవల మమతను రామారెడ్డి మండలం మోషంపూర్‌కు చెందిన ఓ వ్యక్తి ఇచ్చి వివాహం చేశారు. పెళ్లైన కొన్ని రోజుల నుంచి భార్యా,భర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. మమత పది రోజుల క్రితం అడ్లూర్ ఎల్లారెడ్డికి వచ్చేసింది. జీవితంపై విరక్తి చెందిన ఆమె ఈ నెల 7న పురుగుల మందు తాగింది. ఈ విషయం తెలుసుకున్న ఆమె సోదరి ప్రత్యూష సైతం పురుగుల మందు సేవించడంతో గ్రామస్తులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఇక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని వెల్‌నెస్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ప్రత్యూష మృతి చెందినట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. మమత ప్రస్తుతం చికిత్స పొందుతోంది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ధర్మారం గ్రామానికి చెందిన యువకుడు..

నవీపేట: మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన ప్రవీణ్ గౌడ్(33) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై వినయ్ గురువారం తెలిపారు. ఇంటి నిర్మాణం కోసం ప్రవీణ్ అదే గ్రామానికి చెందిన నర్సయ్య అనే వ్యక్తి వద్ద రూ.50వేలు అప్పుగా తీసుకున్నాడు. డబ్బులు తిరిగివ్వాలని నర్సయ్య వేధించడంతో ప్రవీణ్ వారం రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నందిపేటకు చెందిన వ్యక్తి..


నారాయణ(ఫైల్)

మాక్లూర్ : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ నందిపేట మండల కేంద్రానికి చెందిన నారాయణ(54) అనే ఆర్టీసీ డ్రైవర్ గురువారం మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. నారాయణ బుధవారం రాత్రి తన బైక్ పై నిజామాబాద్ వెళ్తుండగా దాస్‌నగర్ వద్ద ఎదురుగా వస్తున్న ఐచర్ వాహనం ఢీ కొట్టింది. తీవ్రగాయాలపాలైన నారాయణను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుమారుడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దమ్మన్నపేటకు చెందిన వృద్ధుడు

ధర్పల్లి: మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన ఒడ్డే టి నర్సయ్య (70) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. నర్సయ్య గత నాలుగు రోజుల క్రితం తన బైక్‌ను అజాగ్రత్తగా నడుపుతూ రోడ్డు పక్కన నిలిచి ఉన్న ఆటోను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలు కావడంతో నర్సయ్యను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మాచారెడ్డి: ఆగి ఉన్న లారీని ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పాల్వంచ మండలం భవానీపేటకు గంగని రాములు(50)గురువారం ఉదయం ద్విచక్ర వాహనంపై పొలం వద్దకు వెళ్తూ రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ఘటనలో తలకు బలమైన గాయాలై రాములు అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రైయినేజీలోపడి ..

ఖలీల్‌వాడి: నగరంలోని రైల్వే స్టేషన్ సమీపంలో డ్రైయినేజీలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. మృతుడి వయస్సు 50 నుంచి 55 ఏళ్లు ఉంటుందని, ఒంటిపై ఎరుపు రంగు షర్ట్, చేతికి గోల్డ్ కలర్ వాచ్ ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించామన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

ధర్పల్లి: మండలంలోని హొన్నాజీపేట్ గ్రామ శివారులో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అన్ను (22) హొన్నాజీపేటలోని ఓ రైస్ మిల్లులో పని చేసేందుకు పది రోజుల క్రితం వచ్చాడు. తాను ప్రేమించిన అమ్మాయి రెండు రోజుల క్రితం మరణించిన విషయం తెలుసుకున్న అన్ను గురువారం రైస్ సమీపంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి..

ఖలీల్‌వాడి: గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి గురువారం తెలిపారు. మాసాయిపేట రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని కామారెడ్డి స్టేషన్ మేనేజర్ వి.సత్యం తమకు సమాచారం అందించారన్నారు. మృతుడి వయస్సు 50 నుంచి 55 ఏళ్లు ఉంటుందని, ఇతర ఆధారాలు ఏమీ లభించలేదన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 87126 58591 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

ఆన్‌లైన్‌లో జమచేస్తానని రూ.50వేలు టోకరా

ఖలీల్‌వాడి: ఆన్‌లైన్‌లో జమ చేస్తానని రూ.50వేలు తీసుకుని ఓ వ్యక్తి ఉడాయించాడు. నగరంలోని నాల్గో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈఘటన చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వినాయక్‌నగర్‌కు చెందిన రాఘవేంద్రచారి ఈ నెల 8వ తేదీన ఆర్యగనగర్‌లోని బ్యాంకు డిపాజిట్ మిషన్ వద్దకు వెళ్లాడు. డబ్బులను మిషన్‌లో వేసేందుకు వేచి ఉండగా, అక్కడికి వచ్చిన ఓ వ్యక్తి తనకు నగదు అవసరం ఉందని,చేతికి నగదు ఇస్తే తాను ఆన్‌లైన్‌లో జమ చేస్తానని చెప్పాడు. అతడి మాటలు నమ్మిన రాఘవేంద్రచారి డబ్బులు ఇవ్వగా, సదరు వ్యక్తి ఆన్‌లైన్‌లో డబ్బులు జమ చేసినట్లు నకిలీ మెసేజ్ చూయించి అక్కడి నుంచి జారుకున్నాడు. ఆ తరువాత డబ్బులు తన ఖాతాలో జమ కాలేదని రాఘవేంద్రచారి గ్రహించాడు. దీనిపై గురువారం నాలుగో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యం సీజ్


పోలీసులు సీజ్ చేసిన రేషన్ బియ్యం

సిరికొండ: మండలంలోని రావుట్ల గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని గురువారం సీజ్ చేసినట్లు ఎస్సై ఎల్ రామ్ తెలిపారు. ముచ్కూర్ గ్రామానికి చెందిన పప్పుల బాలకృష్ణ అనే వ్యక్తి బియ్యం నిల్వ ఉంచాడని అందిన సమాచారం మేరకు దాడి చేసినట్లు తెలిపారు. నాలుగు క్వింటాళ్ల అరవై కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.



క్లుప్తంగా

వైభవంగా దుర్గామాత తెప్పోత్సవం



నవీపేట: మండలంలోని జన్నెపల్లి గ్రామంలోని మైనంపల్లి గెస్ట్‌ హౌజ్‌ ఆవరణలో గురువారం రాత్రి వైభవంగా దుర్గామాత తెప్పోత్సవ వేడుకలను నిర్వహించారు. మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావ్‌ నిర్మించిన దుర్గామాత ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం పక్కనే గల నీటి కొలనులో దుర్గామాతకు తెప్పోత్సవం నిర్వహించారు. మెదక్‌ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావ్‌, జనవికాస్‌ సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు తెడ్డు పోశెట్టి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్‌



ఖలీల్‌ వాడి: నగరంలోని రెండో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో గురువారం రౌడీషీటర్లకు టౌన్‌ సీఐ శ్రీనివాస్‌ రాజు కౌన్సెలింగ్‌ నిర్వహించారు. ఈసందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. రాబోయే పండుగలను దృష్టిలో పెట్టుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ కౌన్సెలింగ్‌ ఏర్పాటు చేశామన్నారు. ఒకవేళ ఏదైనా నేరంలో పాల్గొంటే అలాంటి వారిపై చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్‌ ప్రవర్తన కలిగి ఉంటే అలాంటి వారిపై ఉన్న రౌడీషీట్‌లను క్లోజ్‌ చేయడానికి ప్రయత్నిస్తామన్నారు. ఎస్సై యాసీన్‌ ఆరాఫత్‌, సిబ్బంది పాల్గొన్నారు.

అశోక్‌సాగర్‌లో మృతదేహం లభ్యం

ఎడపల్లి(బోధన్‌): మండలంలోని అశోక్‌సాగర్‌లో గురువారం కళ్యాణ్‌కర్‌ నర్సింగ్‌(55) మృతదేహాన్ని లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. నిజామాబాద్‌ పట్టణంలోని కసాబ్‌గల్లికి చెందిన నర్సింగ్‌ అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 8న మంగళవారం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. గురువారం అశోక్‌ సాగర్‌లో శవమై తేలాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్‌ ఆస్పత్రికి తరలించామన్నారు. కేసు నమోదు చేసుకున్నామన్నారు.

నేషనల్‌ లెవల్‌ సాఫ్ట్‌బాల్‌లో బంగారు పతకాలు



నిజామాబాద్‌నాగారం: ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం నంద్యాలలో నిర్వహించిన 42వ జూనియర్‌ సాఫ్ట్‌ బాల్‌ చాంపియన్‌షిప్‌ పోటీల్లో జిల్లాకుచెందిన క్రీడాకారిణులు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర జట్టును విజేతగా నిలిపారు. సుంకపాక సౌమ్యారాణి (వంది మడుగు), గోక సాత్విక (పిప్రి), దౌట్టి సన్నిత (పుప్పాలపల్లి), కేతావత్‌ సోని (మంచిప్ప), జిన్న వైశాలి (అక్లూర్‌), గోక శ్రావిక (పిప్రి) రాష్ట్ర జట్టు ప్రథమ స్థానంలో నిలవడంలో కీలకపాత్ర పోషించారు. జిల్లా సాఫ్ట్‌ బాల్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు వి ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్‌ వారిని అభినందించారు. అలాగే చాంపియన్‌షిప్‌లో గోక సాత్విక చక్కని ప్రతిభ కనబరిచి జాతీయ ఉత్తమ పిక్చర్‌ అవార్డును సాఫ్ట్‌బాల్‌ ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియా జాయింట్‌ సెక్రెటరీ కే శోభన్‌బాబు చేతుల మీదుగా అందుకున్నారు.

అథ్లెటిక్స్‌లో జిల్లాకు పతకాల పంట



కామారెడ్డి అర్బన్‌: హన్మకొండ జేఎన్‌ స్టేడియంలో ఈనెల 7,8 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారులు రెండు బంగారు, నాలుగు వెండి, మూడు కాంస్య పతకాలు సాధించినట్లు అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ కామారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్‌ తెలిపారు. అండర్‌-20 విభాగంలో ఎం.ఈశ్వర్‌ 800 మీటర్ల పరుగులో బంగారు, 15 మీటర్ల పరుగులో వెండి పతకం సాధించగా, అండర్‌-18 విభాగం జావెలిన్‌ త్రోలో బి ఈశ్వర్‌ ప్రసాద్‌ బంగారు పతకం సాధించారు. అండర్‌-20లో ఆర్‌. సెహ్వాగ్‌ 400 మీటర్ల పరుగులో వెండి, 200 మీటర్ల పరుగులో కాంస్య పతకం సాధించారు. అండర్‌-14లో ట్రాయథ్లాన్‌లో కే.ప్రవీణ్‌ వెండి పతకం, ఎస్‌.శ్రీను కాంస్య పతకం సాధించారు. అండర్‌-18 విభాగం డిస్కస్‌ త్రోలో పి.గౌతమ్‌ వెండి పతకం సాధించారు. అండర్‌-16 విభాగం లాంగ్‌ జంప్‌లో కే.ఆనంద్‌ కాంస్య పతకం సాధించారు. పతకాలు పొందిన క్రీడాకారులను అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు అభినందించారు.

చిత్తూ చిత్తూల బొమ్మ.. శివుని ముద్దుల గుమ్మ



చుక్కాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు





పెద్దకొడప్‌గల్‌లో..



వేల్పూర్‌లో బతుకమ్మ వేడుకల్లో బాల్కొండ ఎమ్మెల్యే సతీమణి నీరజారెడ్డి, మహిళలు





కామారెడ్డిలో ఎస్పీ సింధుశర్మ



ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలో గురువారం సద్దుల బతుకమ్మ సంబరాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు, సంప్రదాయ దుస్తులు ధరించి వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చారు. అనంతరం ప్రధాన వీధుల్లో బతుకమ్మలు పెట్టి పాటలు పాడుతూ నృత్యం చేశారు.



ఎల్లారెడ్డిలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ పండగలో పాల్గొన్న మున్సిపల్‌ చైర్మన్‌ శ్రీకాంత్‌, ఆర్డీవో ప్రభాకర్‌



బోర్గాంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

మన మక్కలు మహారాష్ట్ర, గుజరాత్‌కు..



ఆరబోసిన మక్కలు



ఎగుమతి అవుతున్న మక్కలు

- పుంజుకున్న ఎగుమతులు
- ధర మాత్రం అంతంతే

మోర్తాడ్‌(బాల్కొండ): నిజామాబాద్‌ జిల్లాలో పండించిన మక్కలను వ్యాపారులు మహారాష్ట్ర, గుజరాత్‌ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రముఖ కంపెనీలకు అవసరమైన ఇథనాల్‌ కోసం మక్కల ఎగుమతి జోరుగా సాగుతోంది. మునుపెన్నడూ లేని విధంగా మక్కల ఎగుమతి పుంజుకున్నా ధర మాత్రం అంతంతమాత్రంగానే ఉందని రైతులు వాపోతున్నారు. సీజన్‌ మొదట్లో ఉన్న ధర ఇప్పుడు లేకపోవడంతో పెద్దగా లాభం దక్కడం లేదంటున్నారు. క్వింటాల్‌ మక్కలకు మొదట్లో రూ.2,650 ధర లభించగా ప్రస్తుతం రూ.2,290కి పడిపోయింది. యాసంగి సీజన్‌ మక్కలను నిలువ చేసుకున్న వారికి క్వింటాల్‌కు రూ.3వేల వరకు ధర లభించింది. 35 టన్నుల సామర్థ్యం ఉన్న పెద్ద వాహనాల్లో మక్కలను మహారాష్ట్ర, గుజరాత్‌కు తరలిస్తున్నారు. ప్రతిరోజూ 10 నుంచి 50 వాహనాలు ఆయా రాష్ట్రాలకు వెళ్తున్నాయంటే మన మక్కలకు ఎంత డిమాండ్‌ ఉందో స్పష్టమవుతోంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,290 కాగా, వ్యాపారులే కొంత మేర ఎక్కువ చెల్లిస్తుండటం విశేషం. వారం, 15 రోజుల వ్యవధిలో తాము కొనుగోలు చేసిన మక్కలకు సొమ్ము చెల్లించే విధంగా వ్యాపారులు రైతులతో ఒప్పందం కుదుర్చుకుని ఎగుమతులు చేస్తున్నారు. బడా వ్యాపారులు గ్రామాల్లో ఏజెంట్లను నియమించుకుని మక్క కొనుగోళ్లు ప్రోత్సహిస్తున్నారు. మద్దతు ధర కన్నా ఎక్కువ ధర వ్యాపారులే చెల్లిస్తుండటంతో రైతులు వారికే విక్రయిస్తున్నారు.

మద్యపాన నిషేధ గ్రామంగా ఆజామాబాద్‌

- మద్యం విక్రయించినా, కొనుగోలు చేసినా రూ. 50వేల జరిమానా
- ఏకగ్రీవంగా తీర్మానం చేసిన గ్రామస్తులు

ఎల్లారెడ్డిరూరల్‌: మద్యం కుటుంబాలను నాశనం చేస్తోందని గుర్తించిన గ్రామస్తులు మద్యపాన నిషేధ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. దీని కోసం గ్రామంలో ఎవరైనా మద్యం విక్రయించినా కొనుగోలు చేసినా రూ. 50 వేల జరిమానా చెల్లించాల్సి ఉంటుందంటూ ఎల్లారెడ్డి మండలంలోని ఆజామాబాద్‌ గ్రామస్తులు, గ్రామ పెద్దలు, యువత అందరు కలిసి ఏకగ్రీవ తీర్మానం చేశారు.



మద్యం విక్రయించొద్దని తీర్మానం చేసిన గ్రామస్తులు(ఫైల్‌)

మద్యం మత్తులో యువత

గ్రామంలో విచ్చల విడిగా మద్యం దొరుకుతుండటంతో యువత మద్యం మత్తున పడి పనులు చేయకుండా కుటుంబాల్లో తగాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీనికి మద్యం అని గ్రహించిన గ్రామ పెద్దలు యువకులతో చర్చించి ఏడాది పాటు గ్రామంలో మద్యం విక్రయించ కూడదని, కొనకూడదని ఏకగ్రీవ తీర్మానం చేశారు. దీనిని అతిక్రమించిన వారికి రూ. 50 వేల జరిమానా విధించడం జరుగుతుందని నిబంధన విధించారు. గ్రామంలో ఎవరైన మద్యం విక్రయిస్తున్నారని సమాచారం అందించిన వారికి రూ. 5వేల బహుమతిని అందిస్తామని ప్రకటించారు. దీనికి అందరూ కట్టుబడి ఉండాలని నిబంధన విధించారు. గ్రామంలో మద్యం విక్రయించవద్దని తీర్మానం చేశారు.

పనులకు వెళ్లడం లేదు



ఉదయం లేచినప్పటి నుంచి గ్రామంలో మద్యం లభిస్తోంది. దీంతో యువకులు పనులకు వెళ్లడం లేదు. కుటుంబాల్లో గొడవలు జరుగుతుండడంతో మద్యం విక్రయాలు జరపవద్దని తీర్మానం చేశాం.

– మల్లేశ్‌, ఆజామాబాద్‌

మద్యం మత్తులో ఉంటున్నారని..



యువత మద్యం మత్తులో ఉంటున్నారని గ్రామంలో మద్యం విక్రయించవద్దని తీర్మానం చేశాం. దీనికి అందరూ కట్టుబడి ఉంటామని ఒప్పుకున్నారు. నిబంధన అతిక్రమించిన వారు జరిమానా కట్టాల్సిందే.

– కిష్టయ్య, ఆజామాబాద్‌

కూలీలు దొరకడం లేదు



వ్యవసాయ పనుల సమయంలో కూలీలు దొరకడం లేదు. డబ్బులు ఉన్నాయంటే అయిపోయే వరకు మద్యం తాగుతున్నారు. మద్యం లేకపోతే సమస్యకు పరిష్కారం లభిస్తుందని గుర్తించి జరిమానా విధించాం.

– పండరి, ఆజామాబాద్‌

తగ్గుతున్న చెరుకు సాగు

- గాయత్రి ఫ్యాక్టరీ పరిధిలో ఐదు వేల ఎకరాలకు పడిపోయిన విస్తీర్ణం
- సాగు పెంచేందుకు రైతులను ప్రోత్సహిస్తున్న యాజమాన్యం



సదాశివనగర్‌లో సాగవుతున్న చెరుకు

సదాశివనగర్‌: మండలంలోని అడ్లూర్‌ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్‌ ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు సాగు విస్తీర్ణం ప్రస్తుతం సగానికి పడిపోయింది. ఫ్యాక్టరీ ప్రారంభంలో 10వేల ఎకరాల్లో సాగు విస్తీర్ణం ఉండగా ప్రస్తుతం 5వేల ఎకరాలకు తగ్గిపోయింది. కోతల సమయంలో కూలీల కొరత, డబ్బుల చెల్లింపుల్లో యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలకు విసిగి రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. దీంతో ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు సాగు విస్తీర్ణాన్ని పెంచడంతో పాటు అధిక దిగుబడులు సాధించే విధంగా రైతులను యాజమాన్యం ప్రోత్సహిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం డ్రిప్‌ పరికరాలను రాయితీపై అందించడానికి ముందుకు రావడంతో ఫ్యాక్టరీ యాజమాన్యం, సిబ్బంది గ్రామాల్లో సాగుపై అవగాహన కల్పిస్తూ సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు చేపడుతున్నారు.

రాయితీ ఇలా..

చెరుకు సాగు చేసే రైతులకు రాయితీ ఇవ్వడానికి ఫ్యాక్టరీ యాజమాన్యం అక్టోబర్‌-2024 నుంచి ఏప్రిల్‌-2025 వరకు కాలపరిమితి విధించింది. ఎకరానికి రూ.9,205 విలువ గల 2.50 టన్నుల చెరుకు విత్తనం లేదా మొలకలు అందించనున్నారు. అలాగే ఒక ఎకరానికి రూ.600 విలువ గల అట్రాటాఫ్‌ కలుపు మందును కూడా రాయితీపై అందించుటకు యాజమాన్యం సిద్ధమైంది. ఈ రాయితీ వర్తించడానికి యాజమాన్యం కొన్ని నిబంధనలు కూడా విధించింది. ఎకరానికి 35 టన్నులకు తగ్గకుండా చెరుకు దిగుబడి సాధించాలి. చెరుకు దిగుబడి 35 టన్నులు లేదా అంతకన్నా ఎక్కువ సాధించిన వారికి రాయితీ పూర్తిగా వర్తిస్తుంది. చెరుకు దిగుబడి ఎకరం తోటలో 25 టన్నుల కంటే తక్కువ సరఫరా చేసిన రైతులకు రాయితీ పూర్తిగా వర్తించదని పేర్కొంటున్నారు.

ఫ్యాక్టరీ పరిధిలో సాగు ఇలా

అడ్లూర్‌ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్‌ ఫ్యాక్టరీ పరిధిలో 13 మండలాల్లో చెరుకు సాగు ఉంది. ప్రస్తుతం 5వేల ఎకరాల్లో సాగు విస్తీర్ణం ఉంది. ఎకరాకు రెండున్నర టన్నుల చెరుకు విత్తనం, ఎరువులు, రసాయనాలను ఫ్యాక్టరీ అందిస్తుండడంతో రైతులు సాగుపై దృష్టి సారించారు.

వరికి డిమాండ్‌ ఉండడంతో..

గతంలో చెరుకు సాగు చేసిన రైతులు తక్కువ సమయంలో ఎక్కువ లాభాలొచ్చే వరి సాగుపై దృష్టి సారించారు. వరికి మార్కెట్‌లో డిమాండ్‌ ఉండడం, ప్రభుత్వం మద్దతు ధర కల్పించడం, సాగునీరు, రవాణ వసతి కల్పిస్తుండడంతో వరిసాగు పెరగడంతో చెరుకు విస్తీర్ణం పడిపోయింది. టన్ను చెరుకు రూ.3,336 ఫ్యాక్టరీ యాజమాన్యం చెల్లిస్తుండగా వరికి క్వింటాల్‌కు రూ.2,200 నుంచి రూ.2,500 ధర పలుకుతుండడంతో చెరుకు సాగు పడిపోయిందని ఆయా గ్రామాల రైతులు పేర్కొంటున్నారు.

కూలీల కొరత కూడా...

చెరుకు పంటను సకాలంలో ఫ్యాక్టరీకి తరలించేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నవంబర్‌ చివరిలో కోతలు మొదలైతే మార్చి, ఏప్రిల్‌ వరకు కోతలు పూర్తి కాకపోవడంతో ఎండల తీవ్రతకు అగ్ని ప్రమాదాల బారినపడి తీవ్ర నష్టాలను చవిచూసిన పరిస్థితులు ఉన్నాయి. ఫ్యాక్టరీ యాజమాన్యం సరిపడా కూలీలను పిలిపించకపోవడంతో సకాలంలో కోతలు పూర్తిగాక పంట దిగుబడి తగ్గుతోంది.

సాగు పెంపుపై దృష్టి



ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు సాగు విస్తీర్ణం పెంపునకు యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించింది. కోత కార్మికులను సకాలంలో రప్పించడంతో పాటు పంట విక్రయించిన రైతులకు పది రోజుల వ్యవధిలోనే పూర్తి స్థాయిలో డబ్బులు చెల్లిస్తోంది. ప్రస్తుతం రైతులకు రాయితీ కల్పిస్తు సాగు విస్తీర్ణం పెంచే దిశగా ముందుకు సాగుతున్నాం. వచ్చే సీజన్‌లో సాగు విస్తీర్ణం పెంచడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

– వేణుగోపాల్‌ రావు, గాయత్రి షుగర్స్‌ ఫ్యాక్టరీ వైస్‌ ప్రెసిడెంట్‌, అడ్లూర్‌ఎల్లారెడ్డి

నిర్ణయం బాగుంది



గాయత్రి షుగర్స్‌ ఫ్యాక్టరీ యాజమాన్యం తీసుకున్న నిర్ణయం బాగుంది. రైతులకు రాయితీ కల్పించడంతో పాటు చెరుకును తరలించిన రైతులకు సకాలంలో డబ్బులు ఖాతాల్లో జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి. అప్పుడే రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించరు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దృష్టి సారిస్తే రానున్న సీజన్‌కల్లా సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్నాయి. వరి సాగుకు ఉన్న ఇబ్బందులు చెరుకు సాగుకు ఉండవు.

– కొప్పుల నర్సారెడ్డి, చెరుకు రైతు, సదాశివనగర్‌

కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ కార్యకర్తల వాగ్వాదం

- కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కుల పంపిణీ సందర్భంగా వివాదం
- ఒకరినొకరు తోసుకున్న కార్యకర్తలు.. అడ్డుకున్న పోలీసులు



తోసుకుంటున్న కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ కార్యకర్తలు

బాల్కొండ: ముప్కాల్‌ రైతు వేదికలో గురువారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కుల పంపిణీ సందర్భంగా బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రసంగిస్తూ.. తులం బంగారు ఇవ్వకుండ లక్ష రూపాయాలే ఇస్తున్నారనడంతో కాంగ్రెస్‌ కార్యకర్తలు ఒక్కసారిగి ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లపాటు పాలించన బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎన్ని నెరవేర్చారంటు ప్రశ్నించారు. దీంతో బీఆర్‌ఎస్‌ కార్యకర్తలు లేచి వచ్చారు. ఈ క్రమంలో రెండు వర్గాల మధ్య తీవ్ర వాగ్వావాదం చోటు చేసుకుంది. ఒకనొకదశలో ఒకరిపై ఒకరు చేయి వేసుకుని తోసుకున్నారు. ప్రభుత్వాన్ని బద్నాం చేసేలా ఎమ్మెల్యే మాట్లాడితే ఊరుకునేది లేదని కాంగ్రెస్‌ కార్యకర్తలు వేదిక పైకి దూసుకెళ్లారు. మంత్రిగా ఉండి ఒక్క డబుల్‌ బెడ్‌రూం ఇల్లు ఇవ్వలేదని నిలదీశారు. ఆర్మూర్‌ రూరల్‌ సీఐ శ్రీధర్‌రెడ్డి సిబ్బందితో కలిసి రెండు పార్టీల నాయకులను సముదాయించారు. సభా ప్రాంగాణం నుంచి రెండు పార్టీల నాయకులు వెళ్లిపోవాలని సూచించారు. కానీ బీఆర్‌ఎస్‌ వాళ్లు వెళ్లిపోతేనే తాము వెళ్తామంటూ కాంగ్రెస్‌ వాళ్లు.. కాంగ్రెస్‌ వాళ్లు వెళ్లిపోతేనే తాము వెళ్తామంటూ బీఆర్‌ఎస్‌ కార్యకర్తలు పట్టుబట్టారు. దీంతో మరింత ఉద్రికత్త నెలకొంది. తనను చంపుతారంటూ ఒక దశలో ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తంచేశారు. పోలీసులు రెండు పార్టీల వారిని బయటకి వెళ్లగొట్టడంతో వివాదం సద్దుమణిగింది. బయటకు వెళ్లిన తరువాత కూడ రెండు పార్టీ నాయకులు, కార్యకర్తలు దూషించుకున్నారు.

సత్వర విచారణతో బాధితులకు న్యాయం


- హిట్‌ అండ్‌ రన్‌ కేసుల పర్యవేక్షణ కమిటీ సమావేశంలో కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు



మాట్లాడుతున్న కలెక్టర్‌ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్‌ : గుర్తు తెలియని వాహనాలు ఢీకొని మృతి చెందిన, తీవ్రంగా గాయపడిన (హిట్‌ అండ్‌ రన్‌) కేసులలో బాధితులకు, వారి కుటుంబీకులకు చట్ట ప్రకారం నష్ట పరిహారం మంజూరు చేసేందుకు వీలుగా త్వరితగతిన విచారణ జరపాలని కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు ఆయా డివిజన్ల ఆర్డీవోలను ఆదేశించారు. కలెక్టర్‌ అధ్యక్షతన ఆయన చాంబర్‌ల్లో గురువారం హిట్‌ అండ్‌ రన్‌ కేసుల జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో 32 హిట్‌ అండ్‌ రన్‌ కేసులు నమోదవగా, వాటిలో 27 ప్రమాద ఘటనలకు సంబంధించి బాధిత కుటుంబాలను గుర్తించినట్లు అధికారులు కలెక్టర్‌ దృష్టికి తెచ్చారు. వీటిలో నిజామాబాద్‌ డివిజన్‌ పరిధిలో 17, ఆర్మూర్‌ డివిజన్లో 7, బోధన్‌ డివిజన్లో 3 కేసులు ఉన్నాయి. కలెక్టర్‌ మాట్లాడుతూ.. హిట్‌ అండ్‌ రన్‌ కేసులలో మృతి చెందినట్లైతే చట్ట ప్రకారం సాధారణ బీమా కౌన్సిల్‌ ద్వారా బాధిత కుటుంబీకులకు రూ. 2 లక్షలు, తీవ్రంగా గాయపడితే బాధితులకు రూ. 50 వేలు నష్ట పరిహారం అందించాల్సి ఉందన్నారు. బాధితులకు పరిహారం మంజూరు చేసేందుకు వీలుగా సమగ్ర విచారణ జరిపి నివేదికలు సమర్పించాలని ఆర్డీవోలకు సూచించారు. బోధన్‌ సబ్‌ కలెక్టర్‌ వికాస్‌ మహతో, అదనపు డీసీపీ బస్వారెడ్డి, నిజామాబాద్‌ ఆర్డీవో రాజేంద్రకుమార్‌, జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వర్‌ రావు, ట్రాఫిక్‌ ఏసీపీ నారాయణ, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్‌ రాజశ్రీ పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
V
నిజామాబాద్
శుక్రవారం ॥ 11-10-2024



తెలుగు తెరపై ఎందరో నటీమణులు తమదైన ముద్ర వేశారు. అటువంటి వారిలో ఇంద్రజ ఒకరు. యమలీల మూవీతో ఎంట్రీ ఇచ్చి తనదైన నటనతో ఆకట్టుకున్నారు. తెలుగుతోపాటు తమిళ, కన్నడ, మలయాళ సినిమాల్లో నటించి ప్రేక్షకలోకానికి మంచి వినోదాన్ని పంచారు. పెళ్లయ్యాక కొంత విరామం తీసుకుని ఇప్పుడు రెండో ఇన్నింగ్స్ మొదలు పెట్టారు. టీవీ షోస్‌తోపాటు సపోర్టింగ్ కేరక్టర్లు చేస్తూ తనదైన శైలిలో దూసుకు పోతున్నారు. అచ్చం తెలుగింటి ఆడపడుచులా కట్టుబొట్టుతో ఆకట్టుకునే ఇంద్రజ టాలీవుడ్‌లో ఎవరితోనూ షేర్ చేసుకోని అంశాలను సాక్షి @ నవశక్తిలో పంచుకున్నారు. విజయదశమి సందర్భంగా ఈ ప్రత్యేక ఇంటర్వ్యూని చివరి ఎపిసోడ్‌లో చూసేద్దాం. https://youtu.be/k_PX5qEAX2U

ఇంద్రజ ఇంటర్వ్యూ హైలైట్స్

- జీవితం దేవుడి స్క్రిప్టే అయినా... కొన్ని ఛాయిసెస్ మాత్రం ఉంటాయి. వాటిని ఎలా సద్వినియోగం చేసుకున్నామనేదే ముఖ్యం.
- నిజమైన భక్తుడికి మతాలు, మనుషులతో సంబంధం లేదు.
- ఎంత గొప్పగా పెళ్లి చేసుకుంటున్నామన్నది ముఖ్యం కాదు. ఎంత కాలం కలిసి ఉంటామన్నదే ముఖ్యం.
- మనసులు కలవకుండా మతాలను కలపడం వల్ల లాభం లేదు.
- అంతర్గతంగా సున్నితమైన మహిళలే బయట గట్టిగా ఉండగలుగుతారు.



‘తెలంగాణలో పుట్టి... పూల పల్లకి ఎక్కి లోకమంతా తిరిగే..వటే’ అంటూ బతుకమ్మను కీర్తిస్తూ మంగ్లీ పాడారు. ఆ పాటతో ప్రపంచవ్యాప్తంగా ఆమె కీర్తి సాధించారు. బతుకమ్మ సంబరాల్లో ఈ పాట వినిపించకుండా ఉండదు. బతుకమ్మ అంటే ‘తంగేడు’ పువ్వు ప్రత్యేకం. బతుకమ్మ పాటల్లో మంగ్లీ పాడిన పాటలు ప్రత్యేకం. నవరాత్రి సందర్భంగా తాను పాడిన తొలి బతుకమ్మ పాట గురించి, ఇతర విశేషాలను గాయని మంగ్లీ ‘సాక్షి’తో ఈ విధంగా పంచుకున్నారు.

పాట పల్లకీ ఎక్కి

‘‘బతుకమ్మ పండగ అంటే మంగ్లీ పాటలు ఉండాల్సిందే అన్నట్లుగా నన్ను అభిమానిస్తున్నారు. ఇది నాకు చాలా సంతోషం కలిగిస్తోంది. అమెరికా, ఆస్ట్రేలియా... ఇలా ప్రపంచంలో ఎక్కడెక్కడ తెలుగు వాళ్లు ఉన్నారో అక్కడ బతుకమ్మ పండగ అంటే నా పాట వినపడుతోంది.

‘ఆ సింగిడిలో రంగులనే దూసి
తెచ్చి దూసి తెచ్చి...
తెల్ల చంద్రుడిలో వెన్నెలలే
తీసుకొచ్చి...
పచ్చి తంగెడుతో గుమ్మాడీ పూలు
చేర్చి...
బంగారు బతుకమ్మను ఇంటిలో పేర్చి...’ అంటూ నేను పాడిన బతుకమ్మ పాటలో ‘తెలంగాణలో పుట్టి... పూల పల్లకి ఎక్కి లోక మంతా తిరిగే..వటే’ అని కూడా ఉంటుంది. అలా నా ఈ ఫస్ట్ పాట నన్ను శ్రోతలకు ఎంత దగ్గర చేసిందంటే ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా ఈ పాట పాడమని అడుగుతుంటారు. నా లైఫ్‌లో బతుకమ్మ అంటేనే చాలా ప్రత్యేకం. నా కెరీర్‌లోనే ప్రాథమిక గీతంగా మారిపోయింది ‘బతుకమ్మ’.


మంగ్లీ

ఇది సందర్భం కాకపోయినా చెబుతు న్నాను... నేను హనుమంతుణ్ణి బాగా పూజిస్తాను. ఆయన గుడి కట్టించాను. నేను కట్టించాలనుకున్నాను.... ఆయన కట్టించు కున్నాడు. గుడి లేకుండా నేను ఆయన్ను చూడలేకపోయాను. నా సంకల్పం నెరవేర్చు తండ్రీ అనుకు న్నాను... నెరవేర్చాడు. నేను చేసిన ప్రోగ్రామ్స్ ద్వారా వచ్చిన డబ్బుతో కట్టించాను. ఆయన ఆజ్ఞ లేనిదే అది జరుగుతుందా? ఇది అద్భుత మైన అవకాశమే కదా.

విదేశాల్లో బతుకమ్మ ఆడాను

నేను విదేశాల్లోని తెలుగువారితో కలిసి బతుకమ్మ పండగ చేసుకున్నాను. బతుకమ్మ ఆడాను... పాడాను... వాళ్లతోనూ ఆడించాను. మంగ్లీ పాట ఎప్పుడు వస్తుందంటూ వాళ్లు ఎదురు చూడటం నాకో మంచి అనుభూతి. నా తెలంగాణ ప్రజలు నన్ను ఎంతో గొప్పగా ఓన్ చేసుకున్నారు. అది నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను నేను.

రెండూ ప్రకృతి పండగలే...

మేం తీజ్ పండగ చేసుకుంటాం. బతుకమ్మ పండగ కూడా అలానే. తీజ్ పండగకు మేం మొలకలను పూజిస్తాం. బతుకమ్మను పూలతో పూజిస్తాం. మొలకలు, పువ్వులు... రెండూ చెట్ల నుంచే వస్తాయి కాబట్టి రెండూ ప్రకృతి పండగలే. అందుకే బతుకమ్మ పాట పాడే తొలి అవకాశం వచ్చినప్పుడు నాకు చాలా ఆనందంగా అనిపించింది. ‘తెలంగాణలో పుట్టి... పూల పల్లకి ఎక్కి లోకమంతా తిరిగే..వటే’ అంటూ మిట్టపల్లి సురేందర్ అన్న అద్భుతంగా రాయడం, నేను పాడటం, బొబ్బిలి సురేష్ మ్యూజిక్ చేయడం అన్నీ బాగా కుదిరాయి. పాటలు అందరూ బాగా పాడతారు... బాగా రాస్తారు... బాగా మ్యూజిక్ చేస్తారు. కానీ ఆ పాటను ఎంత బాగా చూపించామన్నది చాలా ముఖ్యం. దామోదర్ రెడ్డి తన డైరెక్షన్‌తో ఈ పాటను బాగా చూపించాడు. అన్నీ బాగా కుదరడంతో ఈ పాట జనాల్లోకి వెళ్లింది.

ప్రతి ఇల్లూ ఆమెకు నిలయమే

నేను దేవుణ్ణి బాగా నమ్ముతాను. దేవుడు లేనిదే మనం లేము. ప్రతి ఒక్క దేవుడికి గుడి ఉంటుంది కానీ బతుకమ్మకు మాత్రం గుడి ఉండదు. మిట్టపల్లె సురేందర్ అన్న ‘పచ్చి పాల వెన్నెలా...’ పాటలో ఈ విషయాన్ని ఎంత గొప్పగా వర్ణించాడంటే... ఆ పాటలో ఆమెకి ఉన్నన్ని గుళ్లు ఏ దేవుడికీ ఉండవని రాశాడు. గుడి లేని ఆ దైవానికి ప్రతి ఒక్క ఇల్లూ నిలయమే. ప్రతి ఇంట్లో ఆమెను పూజిస్తారు కదా. ప్రతి ఇంట్లోనూ ఆమెను తయారు చేస్తారు. ఏ దేవతనూ తయారు చేసి పూజ చేయరు. కానీ గౌరమ్మను తయారు చేసి మరీ పూజిస్తారు. అందుకే ప్రతి ఒక్క ఇల్లూ ఆమెకు గుడే.


మంగ్లీ

సంబరాలన్నీ జనాలతోనే...

నేను బతుకమ్మను తొలిసారి తయారు చేసింది 2013లో. ఒక చానెల్ కోసం చేశాను. అప్పట్నుంచి ప్రతి సంవత్సరం తయారు చేస్తున్నాను. మా ఇంట్లో బతుకమ్మ పండగను జరుపుకుంటాం. అయితే తొమ్మిది రోజులు అమ్మవారి అలంకారం వంటివి చేసే వీలుండదు. నేనెక్కువగా బయటే జనా లతో పండగ చేసుకుంటా. నా బతుకమ్మ సంబరాలు మొత్తం జనాలతోనో అయి పోతాయి. ఇది కూడా అదృష్టమే.

పూలనే దేవుడిలా పూజిస్తాం


మనం ప్రతి దేవుణ్ణి పూలతో పూజిస్తాం. కానీ పూలనే దేవుడిలా పూజించి, కొబ్బరికాయ కొట్టి, అగరుబత్తులు వెలిగించడం అనేది బతుకమ్మకే జరుగుతుంది. ఈ పండగలో ఉన్న గొప్పతనం ఏంటంటే మగవాళ్లంతా ముందుండి తమ ఇంటి ఆడ వాళ్లను దగ్గరుండి ఆడమని... పాడమని ప్రోత్సహిస్తుంటారు. తెలంగాణలో మహిళల్ని గౌరవించినంతగా ఇంకెక్కడా గౌరవించరు. అమ్మని అయినా బిడ్డల్ని అయినా ఎంతో గౌరవంగా చూస్తారు. ముందుండి నడిపిస్తారు. అంత గొప్ప కల్చర్ తెలంగాణది. ఉన్నోళ్లు... లేనోళ్లు... మంచి చీరలు కట్టుకుని పండగ చేసు కుంటారు’’ అంటూ మా ఇంట్లో అమ్మకి, ఇంకా అందరికీ కొత్త బట్టలు కొంటాను. ఆనందంగా పండగ జరుపు కుంటాం అన్నారు మంగ్లీ.

– డి.జి. భవాని



దసరా ధారణ

తెలుగింటి సంప్రదాయం డ్రెస్సింగ్ లో కనిపించాలి.
స్టైల్ లో ఏ మాత్రం తగ్గకూడదు
వెస్టర్న్ వేర్ అనిపించకూడదు
సౌకర్యం లో బెస్ట్ ఛాయిస్ అవ్వాలి...
పండగ హంగులు ఔరా అనిపించాలి.
ఇండియన్ వేర్ నే డిఫరెంట్ గా ధరించాలి.
దసరా వేడుకలో మరింత స్టైలిష్‌గా
కనువిందు చేసే మోడ్రన్ హంగులివి.



శారీ గౌన్

కుట్టిన చీరలు, ధోతీ చీరలు, ప్యాంట్ తరహా చీరలు, కేప్ స్టైల్ డ్రేప్స్... వంటి వినూత్న పద్ధతులు ప్రాచుర్యం పొందుతున్నాయి. ఎన్నో విభిన్న డిజైన్లలో ఆకట్టుకుంటున్న శారీ గౌన్, షరారా శారీ ధరిస్తే చాలా స్టైలిష్‌గా, తేలికగా, రోజంతా సౌకర్యవంతంగా హుషా రుగా ఉంచుతుంది.

ఎంబ్రాయిడరీ బ్లేజర్

బ్లేజర్లు కార్పొరేట్ రంగానికి మాత్రమే పరిమితం అనుకుం టారు చాలామంది. కానీ, ఎంబ్రాయిడరీ బ్లేజర్‌ను డ్రేప్డ్ స్కర్ట్ లేదా ధోతీ ప్యాంట్‌తో స్టైల్ చేయచ్చు. నడుము భాగాన్ని బెల్ట్‌తో అలం కరిస్తే ఈ డ్రెస్ బెస్ట్ మార్కులు కొట్టేస్తుంది.

గవ్వల కుర్తీ

ధోతీ ప్యాంట్, డ్రేప్డ్ స్కర్ట్ లకు గవ్వలు, అద్దాలతో ఎంబ్రాయిడరీ చేసిన కేప్ లేదా షార్ట్ కుర్తీతో స్టైల్ చేయచ్చు. ఫ్లోరల్ ఎంబ్రాయిడరీ ప్యాటర్న్ ఉన్న లెహెంగా లేదా పలాజో సెట్ కూడా పండగ కళను తెప్పిస్తుంది.





సౌకర్యంగా!

సల్వార్ కమీజ్ అయితే ప్రకాశవంత మైన రంగులు ఉన్నవి ఎంచుకోవాలి. పిల్లలతో సరిపోలే దుస్తులను ధరిం చడం వల్ల ఒకే కుటుంబ రూపాన్ని సృష్టించవచ్చు. పండగ కళ రావాలనే ఆలోచనతో పిల్లలకు గాడీ ఎంబ్రా యిడరీ దుస్తులు వేయకూడదు. వారి డ్రెస్సులు సౌకర్యంగా ఉండాలి. ఆభరణాలు మేనికి గుచ్చుకోకుండా ఉండేవి ఎంచుకోవాలి. భారీ ఆభరణాలను ఉప యోగించే బదులు బ్యాంగిల్స్, జూకాలు తక్కువ బరువున్న యాక్సెసరీస్‌ను ఉపయోగించాలి.

రతన్ టాటాకు నివాళి

నాయనమ్మే ప్రేరణ

రతన్ టాటా మన దేశం గర్వించదగ్గ పారి శ్రామికవేత్త. పారిశ్రామిక విజయాలలోనే కాదు, వదాన్యతలోనూ ఆయన ఎందరికో స్ఫూర్తి ప్రదాత. అంతటి రతన్ టాటాకు స్ఫూర్తినిచ్చిన వ్యక్తి ఒకరు ఉన్నారు. ప్రతి పురుషుడి విజయం వెనుక ఒక మహిళ ఉంటుందనే నానుడి రతన్ టాటా విషయం లోనూ నిజమే! చిన్ననాటి నుంచి రతన్ టాటాకు స్ఫూర్తి ఆయన నాయనమ్మే! రతన్ టాటా నాయనమ్మ నవాజ్‌బాయి టాటా సన్స్ కంపెనీకి మొదటి మహిళా డైరెక్టర్. టాటా ట్రస్ట్ చైర్‌పర్సన్‌గా కూడా ఆమె సేవ లందించారు.

రతన్ టాటాకు పదేళ్ల వయసు ఉన్న ప్పుడే ఆయన తల్లిదండ్రులు విడాకులు పొంది విడిపోయారు. అలాంటి గడ్డు పరిస్థి తుల్లో రతన్ టాటా, ఆయన తమ్ముడు జిమ్మీ టాటాల బాధ్యతను నాయ నమ్మ నవాజ్‌బాయి చేపట్టారు. వారిద్దరినీ అల్లారుముద్దుగా పెంచారు. సాటి మనుషులతో మెలగాల్సిన తీరును, జీవితంలో పాటించాల్సిన విలువ లను నేర్పించారు. తన జీవితాన్ని తీర్చిదిద్దిన నాయనమ్మే తనకు స్ఫూర్తి ప్రదాత అని, తాను సాధించిన విజయాల ఘనత ఆమెకే చెందు తుందని రతన్ టాటా ‘హ్యూమన్స్ ఆఫ్ బాంబే’ ఇంటర్వ్యూలో స్వయంగా చెప్పారు. నాయనమ్మ పెంపకంలో పెరగకపోయి ఉంటే, తాను ఇంతటివాణ్ణి కాగలిగేవాణ్ణి కాదని రతన్ టాటా తరచుగా చెబుతుండేవారు.



నాయనమ్మ నవాజ్‌బాయితో రతన్ టాటా

ఇక్కడ చదువు పూర్తయ్యాక ఉన్నతవిద్య కోసం రతన్ టాటా అమెరికా వెళ్లారు. కార్నెల్ యూనివర్సిటీ నుంచి ఆర్కిటెక్చర్, స్ట్రక్చరల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ పూర్తి చేశారు. ఆ తర్వాత లాస్ ఏంజెలిస్‌లోని ఒక ఆర్కిటెక్చర్ సంస్థలో ఉద్యోగంలో చేరారు. అక్కడే స్థిరపడిపోవాల నుకున్న దశలో నాయనమ్మ నవాజ్‌బాయి అనారోగ్యానికి లోనయ్యారు. స్వదేశానికి తిరిగి వచ్చేయమని ఆమె కోరడంతో రతన్ టాటా అమెరికా జీవితానికి స్వస్తిచెప్పి, బాంబేకు వచ్చేసి, టాటా సంస్థల బాధ్యతల్లో పాలుపంచుకో వడం మొదలుపెట్టారు.

నాలుగుసార్లు ప్రేమలో పడినా

రతన్ టాటా పారిశ్రామికవేత్తగా ఘనవిజయాలు సాధించినా, అవి వాహితుడిగానే మిగిలిపోయారు. ఆయన తన జీవితంలో నలుగురు మహిళలతో ప్రేమలో పడ్డారు. కొన్నిసార్లు దాదాపు పెళ్లి వరకు వెళ్లినా, పెళ్లి మాత్రం చేసుకోకుం డానే మిగిలిపోయారు. ఈ సంగతిని రతన్ టాటా స్వయంగా వెల్లడిం చారు.

దాదాపు పుష్కరం కిందటి ‘హ్యూమన్స్ ఆఫ్ బాంబే’ ఇంట ర్వ్యూలో రతన్ టాటా తన అంత రంగికమైన సంగతులను ప్రస్తావిం చారు. ‘నాలుగుసార్లు ప్రేమలో పడ్డాను. కొన్నిసార్లు దాదాపు పెళ్లి వరకు వెళ్లాను. పరిస్థితుల ప్రభావంతో పెళ్లి మాత్రం జరగలేదు. పెళ్లి చేసుకోవలసిన పనుల్లో తీరికలేకుండా మునిగిపోవడం సహా అనేక కారణాల వల్ల పెళ్లి చేసుకో లేకపోయాను’ అని చెప్పారు. లాస్ ఏంజెలెస్‌లో ఉన్నప్పుడే తొలిసారి ఒక అమ్మాయితో ప్రేమలో పడ్డానని, కొన్ని పరిస్థితుల వల్ల భారత్‌కు తిరిగి వచ్చే యాల్సి వచ్చిందని తెలిపారు.


రతన్ టాటా – సిమీ గరేవాల్

సిమీ గరేవాల్‌తో ప్రేమాయణం

బాలీవుడ్ నటి సిమీ గరేవాల్‌తో రతన్ టాటా ప్రేమాయణం గురించి చాలా కథ నాలే వెలువడ్డాయి. సిమీ గరేవాల్ ఒక టీవీ చానెల్ కోసం నిర్వహించిన ‘రెండెజ్‌వూస్ విత్ సిమీ గరేవాల్’ కార్యక్రమంలో ఒకసారి రతన్ టాటాను కూడా ఇంటర్వ్యూ చేశారు. ఆమె కూడా తన ఇంటర్వ్యూలో ‘ఎందుకు పెళ్లి చేసుకోకుండా ఉండిపోయారు?’ అని రతన్ టాటాను అడిగారు. ఇదిలా ఉంటే, సిమీ గరేవాల్ వేరే ఇంటర్వ్యూలో రతన్ టాటాతో కొంతకాలం తానే డేటింగ్ చేసి నట్లు చెప్పారు. తాను సినిమాల్లో బిజీగా ఉంటున్నా, ఇద్దరమూ తరచు కలు సుకునేవాళ్లమని తెలిపారు. రతన్ టాటా మరణం పట్ల సంతాపాన్ని వ్యక్తం చేస్తూ ‘నువ్వు వెళ్లిపోయావని అంటున్నారు. నువ్వు లేని లోటును భరించడం చాలా కష్టం.. వీడ్కోలు మిత్రుడా!’ అని గురువారం ఉదయం సిమీ గరేవాల్ ఒక పోస్ట్ పెట్టారు.

దసరా సరదాలు

ప్యారీ మనవరాలు... పూరీ ముచ్చట్లు

‘‘నానమ్మా... అనవసరంగా స్ట్రెస్సు పెంచుకోకు. తగ్గే మార్గం చెబుతా విను గ్రానీ డ్యూడ్’’ అంది నా కూతురు.

‘‘ఏం చెబుతావో ఏమో... ఈమధ్య అంతా సైన్సు మాట్లాడుతున్నావ్. స్ట్రెస్సు ఈజ్ డైరెక్ట్‌లీ ప్రపోర్షన్ టు పిండిపైన ఉండే అప్పడాల కర్ర అండ్ ఇన్వర్స్‌లీ ప్రపోర్షన్ టు కిందనుండే రౌండు పీట అండ్ బీటా టీటా అల్ఫా ఒమెగా అంటూ అదేదో అంటుంటావ్. నా పాట్లేవో నన్ను పడనీ మనవరాల్ డ్యూడ్’’ అంది మా అమ్మ.

• • •

మా అమ్మకూ ఈమధ్యే బీటెక్‌లో చేరిన నా కూతురికీ మధ్య భలే ఫ్రెండ్షిప్. ఒకరంటే ఒకరికి ఇష్టం. ఇద్దరిమధ్యా ‘షోలే’ వీరూ, జైయంత చనువు.

టైము దొరికినప్పుడల్లా ఇప్పటి సినిమాల్ని ఓటీటీలో మా అమ్మకు చూపిస్తూంటే, మా అమ్మ అప్పటి సినిమాల్ని టీవీలో నా బిడ్డకు చూపిస్తూ యమా టైంపాస్ చేసేస్తుంటారు ఇద్దరూ! ఈ వైభోగానికి తోడు సెంట్రల్ జీఎస్టీ, స్టేట్ జీఎస్టీ, లోకల్ టాక్సెస్ ఎక్స్‌ట్రాల్లాగా నానమ్మా, మనవరాళ్లిద్దరి మధ్యా ఎక్స్‌ట్రా వాదులాటలూ, కీచులాటలూ, గొడవలూ... ఆ తర్వాత ఎదుటాళ్లను గెలిపించి తామోడిపోడానికి పోటీలూ, పేచీలు!

ఫరెగ్జాంపుల్... ‘‘హే యూ ఓల్డ్ లేడీ... చూస్తుండగానే అన్నపూర్ణవు కాస్తా నిర్మలమ్మ అయిపోతున్నావు నువ్వు’’ అంటూ నా కూతురంటే...

‘‘మీ అమ్మ మాత్రం అవ్వడం లేదా... రమ్యకృష్ణ లాంటిది కాస్తా వదినమ్మ వేషాల సుధాలాగా’’ అంటుంది మా అమ్మ.

ఇదెలా ఉంటుందంటే హీరోని పొడవలేని విలన్ అనుచరుడు కాస్తా చివరకు సెకండ్ హీరోయిన్‌ని పొడిచేసి నంత చిత్రంగా. ఇలా ఎందుకంటే... తన మనవరాల్నేమీ అనలేకా... అందమైన హీరోయిన్‌లతోనే గాక... ఇంకెవ్వరి తోనూ పోల్చలేక! ఆ కూతురితో పోల్చదగ్గది మరొక రుండరూ... ఉండకూడదనే అత్యాశకొద్దీ!!



• • •

అసలీ సంభాషణకు కారణం... దసరా సెలవలు కదా. అమ్మమ్మ గారి ఇంటికంటూ మా అక్కవాళ్ల పిల్లలు మా ఇంటికి రావడమూ... పండక్కి మా అమ్మను కొన్ని కోర్కెలు కోరడమూనూ. మనవరాళ్లు కదా! వాళ్ల వరాలు తీర్చకుండా ఎలా ఉంటుంది మా అమ్మ. అవేమిటంటే... మా పిల్లలకేమో చిట్టిగారెల్లో మటన్ కూర కావాలట. అక్క పిల్లలేమో ‘గారెలు మేం మామూలుగానే తినేస్తాం. మటన్‌లో పూరీలు ముంచుకుతింటాం. కాబట్టి ఎక్స్‌ట్రాగా పూరీలు చేయమంటు’ న్నారు.

దాంతో రెండూ చేసే పనిలో బోల్డెంత ఒత్తిడికి లోనవుతోంది మా అమ్మ. ఆమెను అనునయిస్తూ స్ట్రెస్సును తగ్గించే పనిలో ఉంది నా బిడ్డ.

• • •

‘‘అయినా... పూరీలు టైముకు ప్రిపేర్ అవ్వాలంటే... అసలెంతో కొంత స్ట్రెస్ ఉండాల్సిందేలే నానమ్మా’’ అంది నా కూతురు.

‘‘అదేందోగానీ ‘పిల్లా... ఈ స్ట్రెస్సొచ్చిన ప్పుడల్లా నా కిడ్నీల్లో హార్ట్ ఎటాక్ వచ్చినట్టుంటుంది బ్రో. ఈ ఒత్తిడి అనేది ఉంది చూశావూ... మొదట ‘అగ్నిపర్వతం’ ‘ఈగాలిలో...’ పాటలోలాగా కృష్ణ పాస్ పోర్టు ఫొటోంత సైజులో ఉంటుందా! కాసేపటికే విజయశాంతి పట్టుకున్న సూపర్‌స్టార్ కటౌటంతగా పెరుగుతుంది. అబ్బో... అలా పెరిగినప్పుడు నాకెంత దాహం వేస్తుంటుందో తెలుసా పిల్లా? ‘దేవత’లో శోభన్‌బాబు, శ్రీదేవీ పాటలోని అన్ని బిందెల్లోకీ ఎల్లువొచ్చిన గోదారి నీళ్లన్నీ తాగీ తాగీ ఇంకా తాగుతున్నా ఇంకా దాహ మేస్తున్నట్టే అనిపిస్తుంటది’’




‘‘నీకెందుకు నానమ్మా. నీ నర్వస్‌నెస్‌ను ‘రోబో–2’లో పావురమ్మీద స్వారీ చేసే రజినీకాంత్ సైజుకు తగ్గిస్తా’’

‘‘ఓహో... భైరవద్వీపం ‘నరుడా ఓ నరుడా’ పాటలో మరుగుజ్జుల సైజుకా?’’ అంటూ తన పాత సినిమా ఎగ్జాంపుల్‌కు వెళ్తానే... ‘‘అయినా పెద్ద చెప్పొచ్చావ్ గానీ... స్ట్రెస్సుంటే వంట వీజీగా ఎలా అవుతుందే అమ్మాయ్?’’ అడిగింది.

‘‘నా ఇంజనీరింగ్ మ్యాథ్స్‌లా కాకుండా మీ పాత సినిమాల భాషలోనే చెబుతా విను. కొద్దిగా స్ట్రెస్సుంటే... అప్పట్లో మీ ఓల్డుమూవీసులో పొగరుమోతు హీరోయిన్ని ఒక్క టీజింగుసాంగుతోనే హీరో లొంగదీసినంత వీజీగా చేసేగలవు పూరీలన్నీ’’ అంటూ మా అమ్మకు తన ఉపదేశాన్ని మొదలుపెట్టింది నా కూతురు.

• • •

‘‘అన్నట్టు నానమ్మా... ఈ స్ట్రెస్సుతో హెల్త్ సమ స్యలూ అవీ వస్తాయని దాన్ని ఆడిపోసుకుంటుంటారు గానీ... ఒక్క వంటే కాదు. ఏ పనైనా హాయిగా జరిగిపోవా లంటే కాస్త ప్రెషరో, గిషరో వర్కవుట్ అవుతూ ఉండాలి. అదెంతుండాలంటే... కడాయిలో పూరీని పొంగించ డానికీ, కుక్కరులోని రైసును ఉడికిం చడానికీ ఎంత కావాలో... పని సజావుగా జరగడానికి అంతే స్ట్రెస్సుండాలి’’



‘‘ఎందుకే పాపం ఒత్తిడితో ఆ పూరీల్ని అంతలా పొంగించడం? ఎంత పొంగినా చివరకు పూరీకి బొక్కెట్టే కదా తింటారు. విజిల్లతో ఎంతగా మిడిసిపడ్డా ఆవిరి పోయాకే కదా కుక్కర్లోంచి అన్నాన్ని దించుతారు!’’

‘‘నువ్వన్నది కరెక్టేగానీ నానమ్మా... ఎలాగూ తొక్క వలిచే తింటాంగదా అని తొడిమ ఊడిన అరటిపండు తినగలమా? అలాగే పొంగని పూరీతో పానీ పూరీ చేయ గలమా చెప్పు. పొంగినదానికీ, పొంగ నిదానికీ టేస్టులో ఏమాత్రం తేడా లేక పోయినప్పటికీ పొంగినదాన్నే కదా ప్లేట్లో వేసుకోబుద్ధవుతుంది! అలా పూరీ లోకి చేరి పొంగేలా చేయడమే గాలి గొప్ప. అండ్... వంటలో ఆయొక్క ఐడియల్ ఒత్తిడి ఎంతుండాలంటే... పూరీపొరను చీల్చకూడదూ – అన్నాన్ని మాడ్చకూడదు. సమ్‌ఝే నానమ్మా డ్యూడ్?!’’

‘‘నువ్వు ఎన్నైనా చెప్పవే... ఒత్తిడిలో పని జరగదు గాక జరగదు. పైగా నువ్వంటే ఇంకా డిస్టబెన్సు. కాబట్టి.... రాకమ్మా మనవరాలా రాకమ్మా.... నీ కోవేలా కాలేజీ... కిచేనెందుకూ నీకూ కొలువై ఉండేందుకూ...’’

‘‘నేనేమీ రాన్లేగానీ... నువ్వనుకునేది కరెక్ట్ కాదు. ఒత్తిడి ఎంతుండాలంటే... భోజనం విషయానికి వస్తే అన్నం మాడి ఆకలితో మనల్ని మాడ్చకూడదు... ఆబగా ఓ ముద్ద ఎక్కువ తినేస్తే ఒంటిని జ్వరంతో కాల్చకూడదు. తలనొప్పి రానీకుండా చూసే కాఫీ అనే అమృతానికీ... అమృతాంజనా నికీ సరిగ్గా మధ్యన గీత గీసేంత ఒడుపు కలిగి ఉండటమే ఐడియల్ ఒత్తిడి. దాన్ని నువ్వు స్ట్రెస్సనూ, ప్రెషరను. ఆ నర్వస్‌నెస్సులో ఓ వైబ్రేషనుంది. ఓ ఎమోషనుంటది. అది ఉండి తీరాలి నానమ్మా. కాబట్టి చపాతీలా చతికిల పడకు. పూరీలా పొంగనీ ఉత్సాహం నీలో’’

‘‘అమ్మో అమ్మో... పైకి చూడ్డానికి పూరీలోని పైపొరలా సాఫ్ట్‌గా కనిపిస్తదిగానీ... కిందిపొరలా భయంకరమైన టఫ్‌రా నీ కూతురూ. ప్రతి జనరేషన్‌లోనూ ఓ కొత్త థాట్‌ను ముందుకు తీస్కెళ్లడానికి అప్పుడప్పుడూ వంటగదిలోకి ఒకతొస్తుంది. ఆ పిల్లనే అప్పడాలకర్ర బేరర్ అంటార్రా’’ అపురూపంగా మనవరాల్ని చూసుకుంటూ నాతో అబ్బురంగా అంది మా అమ్మ.

– యాసీన్

సాక్షి బిజినెస్
శుక్రవారం
11-10-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
144	17
81,611	24,998

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	18,278	▼	14
డోజోన్స్	42,399	▼	113
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,238	▼	6
డాక్స్	19,211	▼	44
షాంఘై	3,302	▲	43
నికాయ్	39,381	▲	103

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	74,838	▼	171
బంగారం (99.5 స్వచ్ఛత)	74,538	▼	172
వెండి (కిలో)	88,353	▼	308

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.53	84.59
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	108.69	111.40
€	యూరో	ఎస్‌బీఐ	91.00	93.55
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.17	57.49
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.62	57.63
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	62.05	66.73
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.49	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.97	23.75
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.00	12.83

30 వేల కోట్ల నుంచి 30 లక్షల కోట్లకు!


ఉప్పు నుంచి ఉక్కు దాకా... సబ్బుల నుంచి సాఫ్ట్‌వేర్ అగ్రగామిగా... దేశ ప్రజల తలలో నాలుకగా మారిన టాటా గ్రూప్ ఆకాశమే హద్దుగా దూసుకెళ్తోంది. నేడు రూ.30 లక్షల కోట్లకు పైగా మార్కెట్ విలువతో దేశ కార్పొరేట్ జగత్తులో అత్యంత విలువైన 'రతనం'లా వెలిగిపోతోంది. అలుపెరుగని ఈ పయనంలో టాటా బ్రాండ్‌కు ఖండాంతర ఖ్యాతిని తెచ్చిన ఘనత కార్పొరేట్ 'టైటాన్' రతన్ టాటా సొంతం! లాభార్జనే ధ్యేయంగా కాకుండా సమాజంలోని అన్ని వర్గాలకూ తమ వ్యాపార ఫలాలను పంచిన వితరణశీలిగా కూడా చిరస్థాయిగా నిలిచిపోయారు.

టాటా మహా సామ్రాజ్య జైత్రయాత్ర ఇది...

- పరుగులు తీయించిన రతన్
- విదేశీ కంపెనీల కొనుగోళ్ల దన్ను
- రతన్ సాహసోపేత నిర్ణయాలతో ఆకాశమే హద్దుగా ఎదిగిన గ్రూప్

పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా తన హయాంలో టాటా గ్రూప్‌ను మహా సామ్రాజ్యంగా విస్తరించారు. ఇటు ప్రధానమైన వ్యాపార విభాగాలను పటిష్ఠం చేస్తూనే అటు పేరొందిన విదేశీ దిగ్గజ కంపెనీలను కూడా కొనేసి భారతీయ కార్పొరేట్ల సత్తాను ప్రపంచానికి చాటి చెప్పారు. మిగతా దేశీ కార్పొరేట్లకు స్ఫూర్తినిచ్చారు. విమర్శలు, హేళనలు ఎదురైనా వాటిన్నింటినీ అధిగమించి టాటా గ్రూప్‌ను అంతర్జాతీయ స్థాయిలో దిగ్గజంగా మల్చారు. రతన్ పగ్గాలు చేపట్టేనాటికి గ్రూప్ కంపెనీల మార్కెట్ విలువ దాదాపు రూ.30 వేల కోట్లు మాత్రమే. ఇక ఆదాయం 6 బిలియన్ డాలర్ల (అప్పటి రూపాయి మారకం విలువ ప్రకారం రూ.18,000 కోట్లు) స్థాయిలో నిదానంగా పురోగమిస్తున్న టాటా గ్రూప్ ఆయన సాహసోపేత నిర్ణయాలు, దూకుడు దన్నుతో నేడు ఏకంగా 165 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.14 లక్షల కోట్లు) ఆదాయాల స్థాయికి విస్తరించింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, టాటా స్టీల్, టాటా మోటార్స్ వంటి దిగ్గజాలు ఆయా రంగాల్లో అగ్రగాములుగా ఉన్నాయి. గ్రూప్ సంస్థల్లో ఏకంగా 10 లక్షల మందికి పైగా ఉపాధి పొందుతున్నారు. గ్రూప్‌లో పది విభాగాల్లో ప్రధానంగా 30 కంపెనీలు ఉండగా వీటిలో 26 లిస్టెడ్ కంపెనీలున్నాయి. వీటికి అనుబంధంగా పలు సంస్థలు కూడా ఉన్నాయి. 2024 మార్చి 31 నాటికి వాటి టాటా గ్రూప్ మార్కెట్ విలువ ఏకంగా 365 బిలియన్ డాలర్లను (దాదాపు రూ.30 లక్షల కోట్లు) అధిగమించడం విశేషం. టాటా సంస్థలు 6 ఖండాల్లో 100 పైగా దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నాయి.

– సాక్షి, బిజినెస్ డెస్క్



6 బిలియన్ల నుంచి 100 బిలియన్ డాలర్లకు..

రతన్ టాటా 1991 నుంచి 2012 వరకు టాటా సన్స్ చైర్మన్‌గా వ్యవహరించారు. వివిధ విభాగాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న 95 కంపెనీలు గ్రూప్‌లో ఉండేవి. కెమికల్స్, హోటల్స్, ఉప్పు, ఉక్కు, సబ్బులు, వాచీలు మొదలైన విభాగాల్లో ఇవన్నీ స్వతంత్రంగా కార్యకలాపాలు సాగిస్తూ, ఒకదానితో మరొకదానికి పెద్దగా సంబంధం లేని విధంగా ఉండేవి. రతన్ టాటా వచ్చాక వాటన్నింటినీ పునర్వ్యవస్థీకరించడం, కార్యకలాపాలను క్రమబద్ధీకరించడాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. వివిధ అనుబంధ సంస్థలన్నింటికి కూడా ఒకే కార్పొరేట్ గుర్తింపు ఉండాలని నిర్దేశించారు. దేశీ మార్కెట్‌పైనే ప్రధానంగా దృష్టి పెట్టి, నిదానంగా నడుస్తున్న గ్రూప్‌ను అంతర్జాతీయ స్థాయి విస్తరించారు. ఐఐఎం బెంగళూరు పరిశోధన పత్రం ప్రకారం ఆయన హయాంలో గ్రూప్ ఆదాయాలు 6 బిలియన్ డాలర్ల నుంచి 100 బిలియన్ డాలర్లకు (సుమారు రూ. 18,000 కోట్ల నుంచి రూ. 5.5 లక్షల కోట్లకు) ఎగిశాయి. గ్రూప్ మార్కెట్ విలువ 9.5 బిలియన్ డాలర్ల నుంచి 91.2 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ. 30,000 కోట్ల నుంచి రూ. 5 లక్షల కోట్లకు) పెరిగింది.

టాటా వారసుడెవరు..

- రతన్ అస్తమయంతో సర్వత్రా ఆసక్తి
- నోయెల్ టాటాకు అవకాశం?
- రేసులో మెహ్లీ మిస్త్రీ పేరు కూడా

పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా అస్తమించిన నేపథ్యంలో ఇక 365 బిలియన్ డాలర్ల టాటా మహాసామ్రాజ్యానికి వారసులెవరనే ప్రశ్న తెరపైకి వచ్చింది. ఈ సందర్భంగా పలు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీటిలో రతన్ టాటా సవతి సోదరుడు నోయెల్ టాటాతో పాటు ఆయనకు అత్యంత సన్నిహితుడిగా పేరొందిన మెహ్లీ మిస్త్రీ పేర్లు కూడా ఉన్నాయి. వాస్తవానికి రతన్ టాటాకు తోడబుట్టిన సోదరుడైన జిమ్మీ టాటా పేరు కూడా పరిశీలించాల్సినప్పటికీ ఆయన వ్యాపార కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో, రతన్ టాటా తండ్రి నావల్ టాటా, మారుతల్లి సిమోన్ టాటా కుమారుడైన నోయెల్ పేరు ప్రముఖంగా తెరపైకి వచ్చింది. టాటా కుటుంబసభ్యుడు కావడంతో పాటు పలు గ్రూప్ కంపెనీలను నడిపించిన అనుభవం కూడా ఉండటమనేది నోయెల్‌కు కలిసొచ్చే అంశంగా కనిపిస్తోంది. ఆయన ప్రస్తుతం ట్రెంట్, వోల్టాస్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్, టాటా ఇంటర్నేషనల్ సంస్థలకు చైర్మన్‌గా ఉన్నారు. అలాగే రతన్ టాటా ట్రస్టు బోర్డులో కూడా ఉన్నారు. టాటా సన్స్‌ను పర్యవేక్షించే టాటా ట్రస్ట్స్ చైర్మన్‌గా అయ్యేందుకు ఇది ఆయనకు కలిసి వస్తుందని అంచనా వేస్తున్నారు. రతన్ టాటా వివాహం చేసుకోకపోవడం, ఆయనకు సంతానం లేకపోవడంతో నోయెల్ సంతానానికి భవిష్యత్తులో టాటా గ్రూప్‌లో మరింత ప్రాధాన్యం దక్కే అవకాశం ఉంది. నోయెల్‌కు మాయా, నెవిల్, లియా... ఈ ముగ్గురు సంతానం ఉన్నారు. టాటా మెడికల్ సెంటర్‌కి మాయా ట్రస్టీగా వ్యవహరిస్తుండగా, హైపర్‌మార్కెట్ స్టార్ బజార్‌కి నెవిల్ సారథ్య బాధ్యతలు వహిస్తున్నారు. జుడియో బ్రాండ్ విస్తరించడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. టాటా గ్రూప్‌లో భాగమైన ఇండియన్ హోటల్ కంపెనీలో లియా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

సన్నిహితుడు మెహ్లీ..: మెహర్‌జీ పల్లోంజీ గ్రూప్ డైరెక్టర్ అయిన మెహ్లీ మిస్త్రీ, రతన్ టాటాకు అత్యంత సన్నిహితుడు. ఆయనకు టాటా గ్రూప్‌తో చాలాకాలంగా అనుబంధం ఉంది. 2022లో కారు ప్రమాదంలో మరణించిన టాటా సన్స్ మాజీ చైర్మన్ సైరస్ మిస్త్రీకి మెహ్లీ కజిన్ అవుతారు. వాస్తవానికి టాటా సన్స్‌లో పల్లోంజీ మిస్త్రీ గ్రూప్‌నకు 18.4 శాతం వాటా ఉన్నందున ఆ గ్రూప్ అధినేత షాపూర్ మిస్త్రీ పేరు కూడా పరిశీలనకు రావాలి. కానీ టాటాలతో మిస్త్రీలకు విభేదాలు నెలకొన్న నేపథ్యంలో ఆయనకు టాటా సామ్రాజ్యం బాధ్యతలు లభించకపోవచ్చనే అభిప్రాయం నెలకొంది. నోయెల్, మెహ్లీతో పాటు గ్రూప్‌లో ఉన్నవారే కాకుండా బైటి వ్యక్తుల పేర్లు కూడా అకస్మాత్తుగా తెరపైకి వచ్చే అవకాశాలున్నాయి.



మాయా, నెవిల్, మెహ్లీ మిస్త్రీ, నోయెల్, లియా

కీలక కొనుగోళ్లు..

కోరస్: ఆంగ్లో–డచ్ ఉక్కు దిగ్గజం కోరస్‌ను 2007లో టాటా స్టీల్ ఏకంగా 12 బిలియన్ డాలర్లు వెచ్చించింది. ఒక విదేశీ కంపెనీని ఇంత భారీ మొత్తం వెచ్చించి కొనుగోలు చేయడం అప్పటిదాకా కనీవినీ ఎరుగనిది. ఈ కొనుగోలుతో టాటా స్టీల్ ఒక్కసారిగా ప్రపంచంలోనే అతి పెద్ద ఉక్కు దిగ్గజాల జాబితాలోకి చేరిపోయింది. గ్రూప్ మార్కెట్ విలువను గణనీయంగా పెంచింది. అప్పటిదాకా ఎక్కువగా దేశీ మార్కెట్‌పైనే దృష్టి పెట్టిన టాటా స్టీల్, కోరస్ కొనుగోలుతో యూరప్ మార్కెట్లోకి కూడా అడుగుపెట్టింది.

జాగ్వార్ ల్యాండ్‌రోవర్: రతన్ టాటా 2008లో మరో సాహసోపేతమైన ముందడుగు వేశారు. ఈసారి దిగ్గజ బ్రిటీష్ కార్ల బ్రాండ్లు జాగ్వార్, ల్యాండ్‌రోవర్‌పై గురి పెట్టారు. 2.3 బిలియన్ డాలర్లు పెట్టి కొనేశారు. దీనిపై విమర్శలు వెల్లువెత్తినప్పటికీ ఆ తర్వాత అదొక మాస్టర్‌స్ట్రోక్ అని రతన్ టాటా నిరూపించారు.

గ్లోబలైజేషన్ బాటలో గ్రూప్..


ప్రధానంగా భారత్‌పై దృష్టితో కార్యకలాపాలు సాగిస్తున్న గ్రూప్‌ను గ్లోబల్ ప్లేయర్‌గా రతన్ టాటా తీర్చిదిద్దారు. ఇందుకోసం దూకుడుగా విదేశీ కంపెనీలను కొన్నారు. 2008లో బ్రిటీష్ లగ్జరీ కార్ల బ్రాండ్లు జాగ్వార్ అండ్ ల్యాండ్ రోవర్‌ను కొనుగోలు చేయడం ద్వారా అంతర్జాతీయ ఆటోమోటివ్ మార్కెట్లో టాటా మోటార్స్‌ను ప్రముఖ సంస్థగా నిలిపారు. అంతకన్నా ముందుగా 2000లో టెట్లీని కొనుగోలు చేయడం ద్వారా గ్లోబల్ టీ మార్కెట్లో టాటా గ్రూప్ కూడా ప్రధాన ప్లేయర్‌గా ఎదిగింది.

టీసీఎస్.. ఐటీ కోహినూర్!

టాటా గ్రూప్ మార్కెట్ క్యాపిటలైజేషన్ వృద్ధిలో ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) పాత్ర చాలా కీలకం. 1968లోనే ఏర్పడినప్పటికీ రతన్ టాటా సారథ్యంలో టీసీఎస్‌కి రెక్కలొచ్చాయి. 2004లో టీసీఎస్ పబ్లిక్ ఇష్యూకి వచ్చింది. ఏకంగా రూ. 4,713 కోట్లు సమీకరించింది. అప్పటి నుండి అద్భుతమైన పనితీరుతో టీసీఎస్ దూసుకెళ్తోంది. టీసీఎస్‌తో పాటు టాటా మోటర్స్, టాటా స్టీల్, టాటా పవర్ దన్నుతో గ్రూప్ మార్కెట్ విలువ ఏకంగా రూ. 30 లక్షల కోట్లకు ఎగిసింది.

టాటా విజయ ప్రస్థానం ఇదీ..

- **30** గ్రూప్‌లో ప్రధాన కంపెనీలు
- **26** లిస్టెడ్ కంపెనీలు
- లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాప్ **365** బి. డాలర్లు (రూ.30 లక్షల కోట్లు)
- 2023-24లో టాటా కంపెనీల ఆదాయం **165** బిలియన్ డాలర్లు (రూ.14 లక్షల కోట్లు)
- మొత్తం నికర లాభం దాదాపు **1** లక్ష కోట్లు
- గ్రూప్ కంపెనీల్లో మొత్తం ఉద్యోగులు **10** లక్షలకు పైగా
- **6** ఖండాలు
- **100** దేశాలు



సాక్షి స్పోర్ట్స్



భారత పురుషుల టీటీ జట్టుకు కాంస్యం

ఆసియా టేబుల్ టెన్నిస్ (టీటీ) టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టు వరుసగా మూడోసారి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. 2021, 2023 ఆసియా చాంపియన్‌షిప్‌లోనూ భారత జట్టుకు కాంస్య పతకాలు లభించాయి. కజకిస్తాన్‌లో గురువారం జరిగిన సెమీఫైనల్లో భారత జట్టు 0–3తో చైనీస్ తైపీ జట్టు చేతిలో ఓడిపోయింది. తొలి మ్యాచ్‌లో శరత్ కమల్ 7–11, 10–12, 9–11తో లిన్ యున్ జు చేతిలో... రెండో మ్యాచ్‌లో మానవ్ ఠక్కర్ 9–11, 11–8, 3–11, 11–13తో చెంగ్ జుయ్ చేతిలో... మూడో మ్యాచ్‌లో హర్మీత్ దేశాయ్ 6–11, 9–11, 7–11తో హువాంగ్ యాన్ చెంగ్ చేతిలో ఓటమి చవిచూశారు. నేటి నుంచి మొదలయ్యే వ్యక్తిగత విభాగంలో శరత్ కమల్, సత్యన్, హర్మీత్, మనుష్ షా, మానవ్ ఠక్కర్, ఆకుల శ్రీజ, మనిక బత్రా, ఐహిక ముఖర్జీ, సుతీర్థ ముఖర్జీ, దియా పరాగ్ పోటీపడతారు.

విండీస్ మహిళల ధనాధన్ విక్టరీ

- 104 పరుగుల లక్ష్యం 12.5 ఓవర్లలోనే ఉఫ్
- బంగ్లాదేశ్‌పై 8 వికెట్లతో జయభేరి

దుబాయ్: వెస్టిండీస్ మహిళల ఆల్‌రౌండ్ ప్రదర్శనకు బంగ్లాదేశ్ బెంబేలెత్తిపోయింది. దీంతో టి20 ప్రపంచకప్‌లో భాగంగా గురువారం జరిగిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో మాజీ చాంపియన్ వెస్టిండీస్ 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. టాస్ నెగ్గిన కరీబియన్ జట్టు బౌలింగ్ ఎంచుకోగా... ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 103 పరుగులు చేసింది. కెప్టెన్ నిగర్ సుల్తానా (39; 4 ఫోర్లు) మాత్రమే రాణించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్పిన్నర్ కరిష్మా రమ్‌హరక్ (4–0–17–4) ఉచ్చులో బంగ్లా బ్యాటర్లంతా కుదేలయ్యారు. అఫీ ఫ్లెచర్ 2 వికెట్లు తీసింది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన వెస్టిండీస్ 12.5 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 104 పరుగులు చేసి గెలిచింది. క్రీజులోకి దిగిన వారంతా ధాటిగా ఆడారు. కెప్టెన్, ఓపెనర్ హేలీ మాథ్యూస్ (22 బంతుల్లో 34; 6 ఫోర్లు), స్టెఫానీ టేలర్ (29 బంతుల్లో 27 రిటైర్డ్‌హర్ట్; 3 ఫోర్లు) తొలి వికెట్‌కు 7.3 ఓవర్లలో 52 పరుగులు జోడించి శుభారంభమిచ్చారు. షెర్మయిన్ (16 బంతుల్లో 21; 2 ఫోర్లు), డియాండ్రా డాటిన్ (7 బంతుల్లో 19 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) మిగతా పనిని పూర్తి చేశారు. బంగ్లా బౌలర్లలో నహిదా అక్తర్, మారుఫా అక్తర్ చెరో వికెట్ తీశారు. నేడు జరిగే గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో పాకిస్తాన్ తలపడుతుంది.



కరిష్మా రమ్‌హరక్

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



బ్రూక్

ఇంగ్లండ్ 823

బ్రూక్ 317 రూట్ 262

- ముల్తాన్ టెస్టులో రికార్డుల దుమ్ము దులిపిన ఇంగ్లండ్
- తొలి ఇన్నింగ్స్‌లో 823/7 డిక్లేర్డ్
- బ్రూక్ ట్రిపుల్ సెంచరీ
- రూట్ డబుల్ సెంచరీ
- ఓటమి దిశగా పాకిస్తాన్

ముల్తాన్: టెస్టు ఫార్మాట్‌లో వన్డే తరహా ఆట తీరుతో విజృంభించిన ఇంగ్లండ్ జట్టు పలు రికార్డులను బద్దలు కొట్టింది. పాకిస్తాన్ బౌలింగ్‌ను తుత్తునియలు చేస్తూ... హ్యారీ బ్రూక్ (322 బంతుల్లో 317; 29 ఫోర్లు, 3 సిక్సర్లు) ట్రిపుల్ సెంచరీ, జో రూట్ (375 బంతుల్లో 262; 17 ఫోర్లు) డబుల్ సెంచరీతో చెలరేగారు. ఫలితంగా ముల్తాన్ వేదికగా పాకిస్తాన్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్‌ను 823/7 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. టెస్టు క్రికెట్ చరిత్రలో నాలుగో అత్యధిక స్కోరును తమ పేరిట లిఖించుకున్న ఇంగ్లండ్ జట్టు... పలు రికార్డులు ఖాతాలో వేసుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 492/3తో గురువారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ జట్టు... నాలుగో రోజు 49 ఓవర్లు మాత్రమే బ్యాటింగ్ చేసి 331 పరుగులు రాబట్టింది. బంతి స్లాట్‌లో పడితే చాలు దాన్ని బౌండరీకి పంపించడమే లక్ష్యం అన్నట్లు ఇంగ్లండ్ బ్యాటర్లు చెలరేగిపోవడంతో పాకిస్తాన్ బౌలర్లు చేష్టలుడిగిపోయారు. ఈ క్రమంలో రూట్, బ్రూక్ నాలుగో వికెట్‌కు 454 పరుగులు జోడించి కొత్త ప్రపంచ రికార్డు సృష్టించారు. అంతేకాకుండా ఇంగ్లండ్ తరఫున ఏ వికెట్‌కైనా అత్యధిక భాగస్వామ్యం నమోదు చేశారు. మొదట రూట్ డబుల్ సెంచరీ పూర్తి చేసుకోగా... కాసేపటికే బ్రూక్ ద్విశతకం ఖాతాలో వేసుకున్నాడు. ఆ తర్వాత మరింత ధాటిగా ఆడిన బ్రూక్ వరుస బౌండరీలతో రెచ్చిపోయాడు. పాక్ బౌలర్లు ఎంత ప్రయత్నించినా ఈ జోడీని విడదీయలేకపోగా... బ్రూక్ 310 బంతుల్లో టెస్టు కెరీర్‌లో తొలి ట్రిపుల్ సెంచరీ అందుకున్నాడు. గ్రాహం గూచ్ తర్వాత (1990లో; భారత్‌పై) ట్రిపుల్ సెంచరీ బాదిన ఇంగ్లండ్ క్రికెటర్‌గా బ్రూక్ నిలిచాడు. ఓవరాల్‌గా టెస్టు క్రికెట్‌లో ఇది 20వ అత్యధిక వ్యక్తిగత స్కోరు. పాకిస్తాన్ బౌలర్లలో ఆరుగురు 100 కంటే ఎక్కువ పరుగులు సమర్పించుకోవడం గమనార్హం. నసీమ్ షా, అయూబ్ చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం 267 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్తాన్ గురువారం ఆట ముగిసే సమయానికి 37 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 152 పరుగులు చేసింది. సల్మాన్ (49 బంతుల్లో 41 బ్యాటింగ్; 5 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... షఫీఖ్ (0), షాన్ మసూద్ (11), బాబర్ ఆజమ్ (5), రిజ్వాన్ (10), ఆయూబ్ (25), షకీల్ (29) విఫలమయ్యారు. నేడు ఆటకు ఆఖరి రోజు. చేతిలో నాలుగు వికెట్లు ఉన్న పాకిస్తాన్... ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 115 పరుగులు వెనుకబడి ఉంది. సల్మాన్‌తో పాటు ఆమేర్ జమాల్ (27 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.



రూట్

ఇవీ రికార్డులు

4 టెస్టు క్రికెట్ చరిత్రలో ఇది (823/7 డిక్లేర్డ్) నాలుగో అత్యధిక టీమ్ స్కోరు. గతంలో శ్రీలంక (1997లో భారత్‌పై 952/6 డిక్లేర్డ్), ఇంగ్లండ్ (1938లో ఆస్ట్రేలియాపై 903/7 డిక్లేర్డ్; 1930లో వెస్టిండీస్‌పై 849) ఎనిమిది వందల పైచిలుకు పరుగులు చేశాయి.

454 టెస్టు క్రికెట్‌లో నాలుగో వికెట్‌కు నమోదైన అత్యధిక భాగస్వామ్యం. 449 పరుగులతో ఆడమ్ వోజెస్, షాన్ మార్ష్ (ఆస్ట్రేలియా: 2015లో వెస్టిండీస్‌పై) పేరిట ఉన్న రికార్డును రూట్, బ్రూక్ బద్దలు కొట్టారు.

1 పాకిస్తాన్‌పై ఒక జట్టు చేసిన అత్యధిక పరుగులు ఇవే (823/7 డిక్లేర్డ్). 1958లో వెస్టిండీస్ చేసిన 790/3 డిక్లేర్డ్ రెండో స్థానంలో ఉంది. పాకిస్తాన్ గడ్డపై నమోదైన అత్యధిక స్కోరు కూడా ఇదే.

2 టెస్టు క్రికెట్ చరిత్రలో బ్రూక్‌ది రెండో వేగవంతమైన ట్రిపుల్ సెంచరీ. 2008లో దక్షిణాఫ్రికాపై వీరేంద్ర సెహ్వాగ్ 278 బంతుల్లోనే ట్రిపుల్ సెంచరీ బాదగా... ఇప్పుడు బ్రూక్ 310 బంతుల్లో ట్రిపుల్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు.

రాఫెల్ నాదల్ వీడ్కోలు

వచ్చేనెలలో డేవిస్ కప్ టోర్నీ తర్వాత ఆటకు గుడ్‌బై

మాడ్రిడ్: టెన్నిస్ చరిత్రలో ఓ దిగ్గజ క్రీడాకారుడి శకం ముగియనుంది. స్పెయిన్ స్టార్ ప్లేయర్ రాఫెల్ నాదల్ వచ్చే నెలలో ఆటకు గుడ్‌బై చెప్పనున్నాడు. నవంబర్ 19 నుంచి 24వ తేదీ వరకు స్పెయిన్‌లో జరగనున్న డేవిస్ కప్ టీమ్ టెన్నిస్ ఫైనల్స్ టోర్నమెంట్ తన కెరీర్‌లో చివరిది కానుందని నాదల్ గురువారం ప్రకటించాడు. ప్రపంచ మేటి ఆటగాళ్లతో సుదీర్ఘ కాలం పోటీ పడిన 38 ఏళ్ల నాదల్ కెరీర్‌లో 22 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించాడు. గత కొన్నాళ్లుగా గాయాలతో సహవాసం చేస్తున్న నాదల్... చివరిసారిగా పారిస్ ఒలింపిక్స్‌లో బరిలోకి దిగాడు. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో జొకోవిచ్ చేతిలో ఓడిన నాదల్... డబుల్స్‌లో అల్‌కరాజ్‌తో కలిసి క్వార్టర్ ఫైనల్ వరకు చేరాడు. గాయం కారణంగా గత నెల లో లేవర్ కప్ నుంచి తప్పుకున్న నాదల్... గురువారం రిటైర్మెంట్ ప్రకటన చేశాడు. 'కెరీర్‌లో సాధించిన దాంతో సంతృప్తిగా ఉన్నా. టెన్నిస్ ప్రాక్టీస్ ప్రారంభించిన తొలినాళ్లలో ఇంత దూరం ప్రయాణిస్తానని ఊహించలేదు. అన్నిటికీ కృతజ్ఞుడిని. బాగా ఆలోచించాకే ప్రొఫెషనల్ కెరీర్‌కు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నా. గత రెండేళ్లు చాలా కఠినంగా గడిచాయి. గాయాలతో బాగా ఇబ్బంది పడ్డా. ప్రతి దానికి ముగింపు ఉటుంది. ఎక్కడో ఒకచోట ఆగి పోవాల్సిందే. ఈ సందర్భంగా ఆటతో మమేకమైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని నాదల్ పేర్కొన్నాడు. 'మట్టికోట మహరాజు'గా గుర్తింపు పొందిన నాదల్... ఫ్రెంచ్ ఓపెన్‌లో అత్యధికంగా 14సార్లు విజేతగా నిలిచి ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచాడు. కెరీర్ చివరి మ్యాచ్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించనుండటం ఆనందంగా ఉందని తెలిపిన నాదల్‌కు సహచర ఆటగాళ్లు, అభిమానులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలిపారు. డేవిస్‌కప్ ఫైనల్స్ నాకౌట్ టోర్నీలో భాగంగా నవంబర్ 19న క్వార్టర్ ఫైనల్లో నెదర్లాండ్స్ జట్టుతో స్పెయిన్ తలపడుతుంది.



12 ఈ ఏడాది నాదల్ మొత్తం 7 టోర్నీల్లో పోటీపడ్డాడు. 19 మ్యాచ్‌లు ఆడాడు. 12 మ్యాచ్‌ల్లో గెలిచి, 7 మ్యాచ్‌ల్లో ఓడిపోయాడు.

209 ప్రపంచ ర్యాంకింగ్స్‌లో నాదల్ 209 వారాలు నంబర్‌వన్ ర్యాంక్‌లో ఉన్నాడు.

1080 నాదల్ తన కెరీర్‌లో గెలిచిన మ్యాచ్‌లు

13,49,46,100 (రూ. 1,133 కోట్లు) కెరీర్‌లో నాదల్ గెలిచిన ప్రైజ్‌మనీ

92 నాదల్ తన కెరీర్‌లో నెగ్గిన మొత్తం సింగిల్స్ టైటిల్స్

22 నాదల్ గెలిచిన గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్. (ఆస్ట్రేలియా ఓపెన్ 2 : ఫ్రెంచ్ ఓపెన్ 14 : వింబుల్డన్ 2 : యూఎస్ ఓపెన్ 4).